VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : మంగళవారం, 25.08.2026
సంపుటి : 09 సంచిక : 77 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24: బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకొని రాష్ట్రానికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సచివాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క, ఇతర ప్రముఖులు

# రాజకీయ పార్టీల మధ్య సిద్ధాంత వైరుధ్యాలు ఉండొచ్చు- కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు ఉండాలి

- కేంద్రం వైఖరి సత్సంబంధాలను దెబ్బతీసేలా ఉంది
- ప్రధాని మోదీ, బీజేపీ ముఖ్యమంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్లొచ్చు కానీ తెలంగాణ ముఖ్యమంత్రిగా నా పర్యటనను అడ్డుకుంటారట
- కేంద్రం వైఖరితో తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు రాకుండా పోతాయన్నదే మా ఆవేదన
- తెలంగాణ అభివృద్ధి కోసం కచ్చితంగా కేంద్రంపై ఒత్తిడి తెస్తాం

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు... రాష్ట్రాల కలయికనే కేంద్ర ప్రభుత్వం. ఇది భారత దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తి విద్య, క్రీడలు, పెట్టుబడులు లక్ష్యంగా మా విదేశీ పర్యటన కార్యాచరణ రూపొందించుకున్నాం తెలంగాణ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఒక కార్యాచరణ తీసుకుని ముందుకెళుతోంది విదేశీ పర్యటనకు సంబంధించి విదేశాంగ మంత్రిత్వ శాఖకు పూర్తి సమాచారం అందించాం విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇంగ్లాండ్ కు అనుమతి ఇచ్చి అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించింది .ఈ విషయంలో కేంద్రం వైఖరిని



అందరూ తప్పు పట్టారు .నా పర్యటనను తిరస్కరించడమే కాకుండా బీజేపీ నాయకులు రాజకీయంగా నాపై వ్యక్తిగత ఆరోపణలు చేశారు .బీజేపీ నాయకులు విచక్షణ కోల్పోయి ప్రభుత్వంపై, అధికారిక పర్యటనపై తప్పుడు ప్రకటనలు చేశారు ..బీజేపీ వైఖరిపై రాజకీయ అంశాలను నేను ప్రస్తావించదలచుకోలేదు.

▶ మిగతా 2లో

## 22ఏపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు



- అబద్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు
- ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- 22ఏ దరఖాస్తులు ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరించాం- 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి..
- 22ఏలో లక్షల ఎకరాలు చేర్చారన్నది అవాస్తవం
- ఎంత భూమి.. ఎందుకు 22ఏలో ఉందో రికార్డులతో మీడియా ముందు ఉంచుతున్నాం
- తప్పు జరిగితే సరిదిద్దుతాం.. అక్రమమైతే చర్యలు

11

## ఫీజుల బకాయిలపై బీజేపీ లడాయి.. ₹15 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలి

- నియంతృత్వంతో దీక్షల అణిచివేత.. విద్యార్థుల కోసం వెనక్కి తగ్గేది లేదు: సర్కార్‌కు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వార్నింగ్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థ పట్ల, విద్యార్థుల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం వహిస్తున్న తీవ్ర నిర్లక్ష్యాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇందులో భాగంగా నాంపల్లిలో వున్న బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో చేపట్టిన 'ఫీజుల బకాయి – బీజేపీ లడాయి'



కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

## పంటల నుంచి ప్రాజెక్టుల దాకా..

- పల్లె పల్లెన పొన్నం అన్న పల్లెల్లో ప్రజాపాలన..
- అడుగడుగునా ప్రజల ఆశీర్వాదం..
- విజయవంతంగా కొనసాగుతున్న కార్యక్రమం.
- చిగురుమామిడి మండలంలో ఐదు గ్రామాల్లో మంత్రి పర్యటన..



- ప్రజల సమస్యలపై అక్కడే కక్కడే స్పందన..
- అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

## అంతర్జాతీయ న్యాయ సేవలకు హైదరాబాద్ వేదిక

- ఏఐ ఆధారిత కేంద్రం ద్వారా వివిధ దేశాల న్యాయ నిపుణుల సేవలకు అవకాశం
- సాంకేతిక ఆధారిత ప్రొఫెషనల్ సేవలకు హైదరాబాద్



అంతర్జాతీయ హబ్‌గా ఎదిగే సామర్థ్యం ఉంది

హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 24:

4

## హ్యామ్ విధానంలో రహదారులకు మహర్దశ



- అచ్చంపేట అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి: మంత్రి జూపల్లి

**నాగర్ కర్నూల్ జిల్లా వెలుతురు ఆగస్టు 24:**

హ్యామ్ (HAM) విధానంలో చేపడుతున్న రహదారి పనులతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రహదారుల మహర్దశ పట్టనుందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బల్మూర్‌లో రూ.146.71 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు హ్యామ్ రహదారి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు .

రూ.7,600 కోట్ల వ్యయంతో హైదరాబాద్–శ్రీశైలం–నంద్యాల జాతీయ రహదారిలో భాగంగా మన్ననూరు–శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం అచ్చంపేట నియోజకవర్గం మీదుగా వెళ్లనుందని మంత్రి తెలిపారు.

## సింగరేణిని కాపాడుకుంటూ.. లాభాల బాటలో నడిపిస్తాం



- బిఎస్ఎన్ఎల్‌లా మారకుండా సింగరేణికి ఉజ్వల భవిష్యత్తు కై క్రిటికల్ మినరల్స్ వైపు అడుగులు!
- బొగ్గుకే పరిమితం కాకుండా బంగారం, లిథియం మైనింగ్‌లోకి సింగరేణి
- ఎన్‌టీపీసీ స్థాయిలో సింగరేణిని నిలబెట్టడమే మా ప్రభుత్వ ధ్యేయం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

10

## పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల పరిహారం వెంటనే అందించాలి

- ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

గత సంవత్సరం 2025 ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీ పాయల్ శంకర్ డి మాండ్ చేశారు.పంట నష్టపోయిన రైతులతో కలిసి సోమవారం రోజున హైదరాబాద్ సచివాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ , రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.



4

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ దీక్ష

- పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆదిలాబాద్ బీజేపీ శ్రేణులతో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

రాష్ట్రంలోని విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ



ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల నిరసన దీక్ష కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీ పాయల్ శంకర్ గారు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన బీజేపీ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారు దీక్షలో పాల్గొన్నారు.

2

## ప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- సెప్టెంబరు 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉంటాయి.
- అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలి
- భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కావు .
- భూసేకరణ, R&R, ఫాస్టు క్లియరెన్సులకి సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెట్టండి.

**సచివాలయం వెలుతురు ఆగస్టు 24:**

అందుబాటులో ఉన్న ప్రజా ప్రతినిధులతో ముగిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం. హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్లు ఆది శ్రీనివాస్,రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య,వేముల వీరేశం , ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,వీర్ల పల్లి శంకర్ ,ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్,మట్టా రాగ మాయి, మందుల సామేల్,వేద్మ బొజ్జు,కోరం కనకయ్య, లక్ష్మి కాంత రావు,రామ్ దాస్ నాయక్,కడియం



శ్రీహరి,డాక్టర్ సంజయ్, బత్తుల లక్ష్మారెడ్డి, మనోహర్ రెడ్డి,తెల్లం వెంకట్ రావు , నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీ లు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య.

## ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది



- ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయి.

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

4

శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో సోమవారం రోజున జరిగిన శాసనమండలి (లెజిస్లేచర్) మైనారిటీల సంక్షేమ కమిటీ , షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ ప్రారంభ సమావేశం.

## పార్టీని నమ్ముకున్న పాతవారికి 70 శాతంకి పైగా పదవులు

- మార్కెట్, సొసైటీ, టెంపుల్, లైబ్రరీ పదవుల్లో పాతవారికి (సీనియర్ నాయకులకు) మొదటి ప్రాధాన్యత
- ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన మోదీ ఇంటికే
- సిఎం రేవంత్ నేతృత్వంలో 100 సీట్లతో అధికారంలోకి వస్తాం



- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**మెదక్ వెలుతురు ఆగస్టు 24:**

2

## రాజకీయ పార్టీల మధ్య సిద్ధాంత వైరుధ్యాలు ఉండొచ్చు- కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు ఉండాలి

ఇది రెండు ప్రభుత్వాలకు సంబంధించిన అంశం .అమెరికా పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు సమర్పించాం రాజకీయపరమైన నిర్ణయాలతో పర్యటనను తిరస్కరిస్తున్నామని చెప్పారు .ఆ రాజకీయ కారణాలు ఏమిటో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పాలి ..ఆగస్టు 17 నుంచి 28 వరకు అమెరికా, కెనడా పర్యటనకు గుజరాత్ ముఖ్యమంత్రికి అనుమతించారు ..వైబ్రంట్ గుజరాత్ అని పెట్టుబడుల కోసం గుజరాత్ ముఖ్యమంత్రికి అనుమతి ఇచ్చారు ..కానీ తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా అమెరికాలో పర్యటించాలనుకుంటే అడ్డుకున్నారు ..నిజంగా నా విదేశీ పర్యటనలో విషయం లేదనుకుంటే ఇంగ్లాండ్ కు ఎందుకు అనుమతి ఇచ్చారు? అమెరికాకు ఎందుకు తిరస్కరించారు? మహాత్మా గాంధీ, అంబేడ్కర్ ఇంగ్లాండ్ లో చదువుకుని దేశానికి దార్శని కులుగా మారారు ..ఆర్థికంగా వెనకబడిన వారు విదేశాల్లో చదువుకునే పరిస్థితి ఉండదు ..విదేశీ చదువులను, క్రీడలను ఇక్కడికి తీసుకురావాలని మేం ప్రయత్నిస్తున్నాం .ఇందుకు విదేశీ పర్యటనలు ఉప యోగపడుతాయని భావించాం. ప్రధాని ఇంకా గుజరాతీగానే వ్యవహరిస్తున్నారు తప్ప భారత ప్రధానిగా వ్యవహరించడం లేదు..ఇది రేవంత్ రెడ్డికి వ్యక్తిగతంగా జరిగిన అవమానం కాదు ..ఇది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అన్యాయం ..దీనినిని రాజకీయాలకు అతీతంగా ఖండించాల్సిన అవసరం ఉంది ..తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటనను కేంద్రం అడ్డుకోవడం తెలంగాణ అభివృద్ధిని వ్యతిరేకిం చడమే కేంద్రం వైఖరి చూస్తోంటే స్పష్టంగా తెలంగాణపై వివక్ష కనిపిస్తోంది .మా ఎంపీలు ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తారు .గుజరాత్ అభివృద్ధికి ఇబ్బంది కలుగుతుందనే నా పర్యటనను కేంద్రం అడ్డుకుంది .ఇది రాజకీయ వివక్ష... తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే మేమంతా కేంద్రం వైఖరిని ముక్త కంఠంతో ఖండిస్తున్నాం .ఇది ఫెడరల్ సూర్తికి విరుద్ధం .నా పర్యటనను అడ్డుకోవచ్చు.. నా లక్ష్యాన్ని చేరుకోకుండా అడ్డుకోలేరు .ఇన్వెస్ట్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 ను డిసెంబర్ 8,9 తేదీల్లో నిర్వహిస్తున్నాం .విద్య, క్రీడల్లో పెట్టుబడులను ఆహ్వానిస్తాం.ముఖ్యమంత్రి సరైన వివరాలు ఇవ్వలేదని మాట్లాడుతున్నారు.. ఇది అధికారిక పర్యటన.. మా కార్యక్రమాలు అన్నీ భారత రాయబార కార్యాలయం పర్యవేక్షణలో జరుగుతుంది .ఇది చాటు మాటుగా జరిగే వ్యవహారం కాదు.. .అన్ని వివరాలను విదేశీ వ్యవహారాల శాఖకు అందించాం .తెలంగాణ అంటే మోదీకి వివక్ష.. చిన్న చూపు..తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు గుజరాతీ నాయకత్వం చేస్తున్న కుట్ర

## హ్యామ్ విధానంలో రహదారులకు మహర్దశ

దీంతో ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. శంషాబాద్ నుంచి అచ్చంపేట మీదుగా బెంగళూరు వరకు బుల్లెట్ రైలు రాబోతుందని చెప్పారు.

### అచ్చంపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత వాసిగా అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపు తున్నారని జూపల్లి అన్నారు. నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.

### ఉమ్మడి పాలమూరు జిల్లాకు రూ.2,963 కోట్లు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రహదారుల నిర్మాణం, ఉన్నతీకరణ కోసం రూ.2,963 కోట్ల నిధు లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. రహదారుల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి నందుకు రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి జూపల్లి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫీజుల బకాయిలపై బీజేపీ లడాయి.. ₹15 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ₹15,000 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, నిధులను నిలిపివేసి పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్రలను మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు అండగా నిలుస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గారు చేపట్టిన రెండు రోజుల శాంతియుత నిరాహార దీక్షకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అనుమతి రద్దు చేయడాన్ని బీజేపీ అప్రజా స్వామిక చర్యగా అభివర్ణించింది. అణగారిన వర్గాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ నియంతృత్వ వైఖరికి నిరసనగా, పార్టీ కార్యాలయ ప్రాంగణంలోనే ఈ దీక్షను అధికారికంగా ప్రారంభించి కొనసాగిస్తున్నట్లు మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రస్తుత ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న ₹2,500 హామీని, రైతులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోగా, ఇప్పుడు ఏకంగా పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థుల భవిష్యత్తును సైతం ప్రమాదంలో పడేస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర విద్యావ్యవస్థ దుస్థితికి ప్రభుత్వ వైఫల్యాలే నిదర్శనమని, బీహార్ లాంటి రాష్ట్రాలు మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్‌లో 20% నిధులు కేటాయిస్తుంటే, తెలంగాణ ప్రభుత్వం కేవలం 8% మాత్రమే కేటాయించడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలోని మొత్తం 30,011 పాఠశాలల్లో ఏకంగా 21,121 పాఠశాలలు కనీస నిర్వహణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ 1,859 పాఠశాలల్లో సురక్షితమైన త్రాగునీటి సదుపాయం లేకపోవడం, 1,752 బాలికల పాఠశాలలు సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేకుండానే నడుస్తుండటం పారిశుద్ధ్య లోపానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. విద్యావ్యవస్థ ఇంతలా కుప్పకూలుతుంటే, సీఎం విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం వదిలేసి విదేశాల నుండి యూనివర్సిటీలను తీసుకొస్తానని విదేశీ పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు.తెలంగాణలోని విద్యార్థి లోకానికి, వెనుకబడిన తరగ తులకు భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు పునరుద్ఘా టించారు. ప్రజాస్వామిక నిరసనలను అణిచివేసేందుకు ప్రభుత్వం చేసే ఎలాంటి కుటిల ప్రయత్నాలకు బీజేపీ భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థికి వారి హక్కుగా రావలసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ అందేలా, అలాగే రాష్ట్ర విద్యావ్యవస్థలోని మౌలిక సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యేంత వరకు ప్రజల పక్షాన బీజేపీ తన పోరాటాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ దీక్ష

విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను ప్రభావితం చేసే సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. కళాశాలలకు ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకర మన్నారు."విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలి. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ శ్రేణులు వారి పక్షాన నిలబడి పోరాడుతాయి" అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారు స్పష్టం చేశారు.విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ చేపట్టిన ఈ పోరాటానికి ఆదిలాబాద్ జిల్లా నుంచి తరలివచ్చిన పార్టీ కార్యకర్తలందరికీ ఆయన అభినందనలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పార్టీ రాష్ట్ర నాయకత్వం చేపట్టే ప్రతి ఉద్యమంలో ఆదిలాబాద్ బీజేపీ శ్రేణులు ముందుండి పోరాడుతాయని పేర్కొన్నారు.




# పంటల నుంచి ప్రాజెక్టుల దాకా..

(మొదటి పేజీ తరువాయి)

**చిగురుమామిడి వెలుతురు ఆగస్టు 24:**
రైతు పొలంలో పంట నుంచి భారీ సాగునీటి ప్రాజెక్టు వరకు.. గ్రామంలోని విద్యుత్ సమస్య నుంచి ఇంటింటి సంక్షేమ పథకాల వరకు.. ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం చిగురుమామిడి మండలంలో ప్రత్యేకతను చాటుకుంది. సోమవారం కొండాపూర్, నవాబుపేట, ఇందుర్తి, ఒగులాపూర్, గునుకులపల్లి గ్రామాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ప్రతి గ్రామంలో ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడంతో పాటు.. అధికా రులతో సమీక్ష నిర్వహించి పరిష్కారానికి ఆదేశాలు, అభివృద్ధి పనులకు హామీలు ఇచ్చారు.

### గౌరవెల్లి పూర్తితో హుస్నాబాద్‌కు జలభరోసా

కొండాపూర్‌లో మంత్రి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగంగా కొన సాగుతోందని తెలిపారు. భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులు మంజూరు చేసిందని, మూడు జిల్లాల కలెక్టర్లు ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు.గౌరవెల్లి కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని మంత్రి కోరారు. భూసేకరణ ప్రక్రియ సాఫీగా పూర్తయితే భూములు సేకరించిన వెంటనే అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుం టామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి విషయంలో ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు.

### ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత.. ప్రతి పొలానికీ ఫామ్‌పాండ్

నీటి సంరక్షణకు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని మంత్రి స్పష్టం చేశారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచించారు. నవాబుపేట గ్రామం ఇంకుడు గుంతల నిర్మాణంలో రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలవాలని పిలుపు నిచ్చారు.గునుకులపల్లిలో రైతులు తమ పొలాల్లో ఫామ్‌పాండ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని, తద్వారా బావులు, బోర్లలో నీటి లభ్యత మెరుగుపడుతుందని వివరించారు.

### ఆయిల్‌ఫామ్ వైపు రైతుల ఆసక్తి

వ్యవసాయంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. ఒకే సంప్రదాయ పంటపై ఆధారపడకుండా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరారు. ఆయిల్‌ఫామ్, నువ్వులు, ఆముదాలు, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.ముఖ్యంగా ఇందుర్తి గ్రామంలో మంత్రి పిలుపుకు రైతుల నుంచి సానుకూల స్పందన లభించింది. దాదాపు 100 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టేందుకు రైతులు ముందుకు రావడం విశేషంగా నిలిచింది. ఆయిల్‌ఫామ్ సాగుతో ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రైతుల ఆసక్తిని అభినందిస్తూ సాగు విస్తరణకు అవసరమైన ప్రోత్సాహం అందేలా చూడాలని అధి కారులను సూచించారు.

### విద్యుత్ సమస్యపై తక్షణ స్పందన

నవాబుపేటలో గ్రామస్తులు విద్యుత్ సమస్యను మంత్రి దృష్టికి తీసుకురాగా.. ఆయన వెంటనే స్పందించారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి గ్రామంలో సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.కొండాపూర్‌లోనూ విద్యుత్ సమస్యపై ప్రజలు ఫిర్యాదు చేయగా.. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటి పరిష్కారానికి యంత్రాంగాన్ని కది లించడమే కార్యక్రమం ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు.

### గ్రామానికో అభివృద్ధి హామీ

ఐదు గ్రామాల పర్యటనలో ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి మంత్రి ప్రత్యేక హామీలు ఇచ్చారు.గునుకులపల్లి గ్రామంలో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని, అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయిస్తానని తెలిపారు. వివో బిల్డింగ్ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుం టామన్నారు.ఒగులాపూర్లో చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం సేకరించిన భూముల అంశాన్ని రైతులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముంపునకు గురైన భూముల్లో పండించిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.కొండాపూర్లో గ్రామాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. విద్య, వైద్యం, అంగన్‌వాడీ సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచిం చారు.నవాబుపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు.ఇం దుర్తిలో గ్రామ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు.

### ఇందిరమ్మ ఇళ్లకు ప్రాధాన్యం

ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా చేయూత అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.కొండాపూర్‌లో ఇప్పటికే 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. గుడిసెల్లో నివసిస్తున్న ఐదుగురికి మంత్రి మంజూరు పత్రాలు అందించారు. గుడాల భాగ్య నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘాల భవనానికి శంకుస్థాపన చేశారు. పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాన్ని కూడా ప్రారంభించారు.నవాబు పేటలో 21, ఇందుర్తిలో 32, గునుకులపల్లిలో 36, ఒగులాపూర్‌లో 8 ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటికే మంజూర య్యాయి. రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నా యని అధికారులు తెలిపారు.

### సంక్షేమ పథకాలతో వేల కుటుంబాలకు ప్రయోజనం

ఐదు గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను అధికారులు మంత్రి సమక్షంలో వివరించారు.కొండాపూర్‌లో 573 మంది రైతులకు రైతుభరోసా కింద రూ.2.30 కోట్లు, 284 మంది రైతులకు రైతు రుణమాఫీ కింద రూ.2.03 కోట్ల ప్రయోజనం కలిగింది. 362 మంది పింఛన్‌దారులకు ప్రతి నెల రూ.8.27 లక్షలు అందుతున్నాయి.నవాబుపేటలో 1,143 మంది రైతులకు రైతుభరోసా కింద రూ.6.90 కోట్లు, 452 మంది రైతులకు రైతు రుణమాఫీ కింద రూ.4.09 కోట్ల ప్రయోజనం కలిగింది. 519 మందికి సామాజిక భద్రత పింఛన్లు అందుతున్నాయి.ఇందుర్తిలో 1,249 మంది రైతులకు రైతుభరోసా కింద రూ.8.06 కోట్లు, 532 మంది రైతులకు రైతు రుణమాఫీ కింద రూ.4.38 కోట్ల ప్రయోజనం కలిగింది. 862 మంది పింఛన్‌దారులకు ప్రతి నెల రూ.19.61 లక్షలు పంపిణీ చేస్తున్నారు.ఓగులాపూర్‌లో రైతుభరోసా కింద 100 మంది రైతులకు రూ.9.67 లక్షలు, రైతు రుణమాఫీ కింద 53 మందికి రూ.42.54 లక్షల ప్రయోజనం కలిగింది. గృహజ్యోతి పథకం కింద 283 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది.గునుకులపల్లిలో 330 మంది రైతులకు రైతుభరోసా కింద రూ.1.86 కోట్లు, 101 మంది రైతులకు రైతు రుణమాఫీ కింద రూ.91.41 లక్షల ప్రయోజనం కలిగింది. ఏడు మంది సన్న రకం ధాన్యం రైతులకు రూ.91 వేల ప్రోత్సాహకం అందించారు.

### ప్రజల వినతులకు ప్రాధాన్యం

ప్రతి గ్రామంలో మంత్రి ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. భూములు, విద్యుత్, ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, మౌలిక వసతులు తదితర సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడిన మంత్రి సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

### ఐదు గ్రామాలు.. ఒకే లక్ష్యం

చిగురుమామిడి మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనలో అభివృద్ధి, వ్యవసాయం, నీటి సంరక్షణ, విద్యుత్, సంక్షేమం, మౌలిక వసతులు ప్రధాన అంశాలుగా నిలిచాయి. ప్రతి గ్రామానికి ఉన్న ప్రత్యేక సమస్యను గుర్తించి.. దానికి అనుగుణంగా పరిష్కార దిశను చూపించడం కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది.

- **గౌరవెల్లి ద్వారా సాగునీటి భరోసా..**
- **ఆయిల్‌ఫామ్ ద్వారా రైతు ఆదాయం..**
- **ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాల పరిరక్షణ..**
- **ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదలకు సొంతింటి భరోసా..**
- **ప్రజల సమస్యలకు అక్కడికక్కడే స్పందన..**

ఇలా పంట నుంచి ప్రాజెక్టుల దాకా.. పల్లె అవసరాల న్నింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనకు చిగురుమామిడి మండలంలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో షర్మిల, డీపీవో జగదీశ్వర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సంబంధిత గ్రామాల సర్పంచులు, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రామ్మోహనాచారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పార్టీని నమ్ముకున్న పాతవారికి 70 శాతంకి పైగా పదవులు

ఉమ్మడి మెదక్ పీఏసీ సమావేశం డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన మెదక్ పీఏసీ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి,ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, డీసీసీ అధ్యక్షులు పూజల హరికృష్ణ, మాజీ మంత్రి చంద్రశేఖర్ రావు తదితరులు హాజరయ్యారు.సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ..**


- **కార్యకర్తల ఆవేదన అర్థం చేసుకుంటాము**
- **మెదక్ కాంగ్రెస్ ఖిల్లాగా మారుతుంది సందేహం లేదు**
- **అర్హ్వత కలిగిన ప్రతి పేదవాడి ఓటు కాపాడటం కోసం సర్ ప్రక్రియ తీక్షణంగా పని చేశాం**
- **2002 కండిషన్ పేరుతో ఓటు హక్కును తొలగించే ప్రయత్నం జరుగుతుంది**
- **నోటీసులు వచ్చిన ప్రతి ఒక్కరు వివరాలు అందజేసి ఓటును కాపాడుకోవాలి**
- **కష్టపడ్డ కార్యకర్తలకు సొసైటీ లో పదవులు**
- **పాతవారికి పదవుల్లో ప్రాధాన్యత**
- **పార్టీని నమ్ముకున్న పాతవారికి 70 శాతంకి పైగా పదవులు**
- **మార్కెట్, సొసైటీ, టెంపుల్, లైబ్రరీ పదవుల్లో పాతవారికి ( సీనియర్ నాయకులకు)మొదటి ప్రాధాన్యత**
- **దేశం ఆశ్చర్యపోయేలా అభివృధి, సంక్షేమం**
- **రఘునందన్ ని సూటిగా అడుగుతున్న?**
- **కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చింది?**
- **ఉద్యోగాల ఇచ్చుడేమో కానీ! ఉన్న ఉద్యోగాలు ఉడగొట్టే పరిస్థితి**
- **జెన్ జీ ఉద్యమం మోడీకి చెంపపెట్టు**
- **మతం కులం పేరిట రాజకీయాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు**
- **ఉద్యోగాలు ఎక్కడా అని యువత ప్రశ్నిస్తోంది**
- **ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన మోదీ ఇంటికే**
- **సిఎం రేవంత్ నేతృత్వంలో 100 సీట్లతో అధికారంలోకి వస్తాం**
- **న్యాయంగా అర్హ్వత కలిగిన ప్రతీ పేదవాడికి ఇళ్లు ఇస్తున్నాం**
- **తెలంగాణలో ఏ ఒక్క నిరుపేద కూడా ఇల్లు లేకుండా ఉండకూడదు.**
- **సోషల్ మీడియా లో అసత్యాలు ప్రచారమే పనిగా పెట్టుకున్నారు**
- **కత్తి పట్టుకున్నోడు కత్తి పోటుకు పోయినట్లు ..సోషల్ మీడియాను నమ్ముకున్న కేటీఆర్ అదే గాల్లో కొట్టుకుపోతాడు**
- **పేదవాడికి చేరువలో వైద్యం కల్పిస్తున్నాం**
- **కాంగ్రెస్ పార్టీ లో స్వేచ్ఛ ఎక్కువ**
- **దళితుడిని అర్ధరాత్రి డిప్యూటీ సీఎం పదవి నుంచి తొలగించిన చరిత్ర బిఆర్ఎస్ ది**
- **బీజేపీ లో మోదీ అమిత్ షా ను ఎదిరించి మాట్లాడే దమ్ముందా?**
- **హద్దులు దాటి మాట్లాడితే పార్టీ ఉపేక్షించేది లేదు**
- **కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారు.**

## వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను
# పసిపాపను పొత్తిళ్ళలో పెట్టుకుని కాపాడుకున్నంత జాగ్రత్తగా కార్యాచరణను అమలు చేయాలి

- **ప్రజల విస్తృత భాగస్వామ్యంతో ప్రత్యేక వనమహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలి**
- **ప్రత్యేక వనమహోత్సవానికి ఉద్దేశించిన “ఎక్కువ మొక్కలు నాటుదాం – ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపడదాం” థీమ్ ను ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాలి**
- **జిల్లా కలెక్టర్లు, డిఎఫ్ఓలు ప్రతినిత్యం వారి వారి జిల్లాల్లో వన మహోత్సవం కార్యక్రమాల పురోగతిని సమీక్షించాలి**
- **నాటిన మొక్కలను జియో ట్యాగింగ్ ద్వారా నమోదు చేసి, వాటిని పెరుగుదల, సంరక్షణను నిరంతరం పర్యవేక్షించాలి**
- **సెప్టెంబర్ చివరి వరకు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు మొక్కలను నాటడాన్ని పూర్తి చేయాలి**
- **ఆగస్టు 25న ‘ప్రత్యేక వన మహోత్సవం’ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్లు, డిఎఫ్ఓలు అటవీశాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం**
- **జూబ్లిహిల్స్ లోని తన నివాసం నుంచి జూమ్ వేదికగా ప్రత్యేక వన మహోత్సవం పై అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చిన మంత్రి**

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

నాటిన ప్రతి మొక్కను భవిష్యత్ తరాలకు ప్రాణవాయువును అందించే జీవనదాతగా భావించి, పొత్తిళ్లలో పెట్టుకుని కాపాడుకున్నంత అపురూపంగా వాటిని సంరక్షించాలని మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సెప్టెంబర్ చివరి నాటికి ఎలాగైనా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని పూర్తిచేసేలా పకడ్బందీ కార్యాచరణను చేపట్టాలని వారికి నిర్దేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రేపు (ఆగస్టు 25న) నిర్వహించనున్న ‘ప్రత్యేక వనమహోత్సవం’ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారుల (డిఎఫ్ఓలు)తో సోమవారం రోజున అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సన్నాహక సమావేశం నిర్వహించారు. జూబ్లిహిల్స్ లోని తన నివాసం నుంచి జూమ్ వేదిక ద్వారా సమావేశంలో పాల్గొని, ప్రత్యేక వనమహోత్సవం కార్యక్రమం సందర్భంగా జిల్లాల వారీగా చేపట్టిన ఏర్పాట్లు, పురోగతిపై మంత్రి సురేఖ సమీక్షించారు. అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, పిసిసిఎఫ్(హెచ్ఓఎఫ్ఎఫ్) వినయ్ కుమార్, పిసిసిఎఫ్ రత్నాకర్ జౌహరి(డెవలప్ మెంట్), సిసిఎఫ్ ప్రియాంక వర్గీస్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి , సిఎఫ్ ప్రదీప్ షెట్టి, హైదరాబాద్ డిఎఫ్ఓ శ్రీనివాస్ తదితరులు అరణ్య భవన్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు జిల్లాల కలెక్టర్లతో మంత్రి కొండా సురేఖ గారు నేరుగా మాట్లాడారు. ప్రత్యేక వనమహోత్సవం నిర్వహణకు చేసిన ఏర్పాట్లను, గ్రామం, మండలం, జిల్లాల వారీగా చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్లు, డిఎఫ్ఓలు మంత్రికి వివరించారు. నాటిన మొక్కల సంరక్షణకు చేపడుతున్న చర్యలు, మొక్కలు నాటేందుకు కొత్తగా గుర్తించిన ప్రాంతాలు, జియో ట్యాగింగ్, వర్షపు నీటి సంరక్షణ, నేల తేమను పెంచడానికి ఉద్దేశించిన కందకాలు తీయడం, రాతికట్టల నిర్మాణం, చెక్ డ్యాముల ఏర్పాటు తదితర అంశాలపై కలెక్టర్లు, డిఎఫ్ఓలు మంత్రి సురేఖ గారికి వివరాలు వెల్లడించారు. 2026 వనమహోత్సవ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 16.06 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, 23 ఆగస్టు 2026 నాటికి 9.06 కోట్ల మొక్కలను నాటినట్లు అటవీ ఉన్నతాధికారులు మంత్రి సురేఖ గారికి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, రైతులు, స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ సంస్థలు తదితర అన్ని వర్గాల సహకారంతో ప్రత్యేక వన మహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. మీడియా ప్రతినిధులను కూడా వనమహోత్సవంలో భాగస్వాములను చేసి, మొక్కలు నాటడం, వాటి సంరక్షణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని అధాకరులకు మంత్రి సురేఖ దిశానిర్దేశం చేశారు. జాతీయ అటవీ విధానం 1988 ప్రకారం రాష్ట్రంలో పచ్చదనం విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచడమే వనమహోత్సవ కార్యక్రమం ప్రధాన లక్ష్యం కావాలన్నారు. ప్రతి ఇంట్లో ఒక మొక్కను నాటి, ఆ మొక్కను సంరక్షించే దిశగా కార్యాచరణను అమలు చేయాలని మంత్రి సురేఖ సూచించారు. మెప్మా ఉద్యోగులు, అంగన్ వాడీ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలన్నారు. అటవీ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో చేపట్టే వనమహోత్సవ కార్యక్రమాలను వేర్వేరుగా పరిగణించి, వాటి స్వభావానికి అనుగుణంగా లక్ష్యాలు, కార్యాచరణ, పర్యవేక్షణ ఉండాలని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ప్రతి గ్రామపంచాయతీని సంప్రదించి వారి అవసరాలకు అనుగుణంగా మొక్కలను సరఫరా చేయాలని చెప్పారు. జలాశయాల కట్టలపై అనువైన మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. రైతులకు, గౌడ సామాజిక వర్గానికి వారి వారి అవసరాల మేరకు మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. ఈ దిశగా జిల్లా కలెక్టర్లు, డిఎఫ్ఓలు పరస్పరం సమన్వయంతో వ్యవహరిస్తూ అనుకున్న లక్ష్యాలను సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేక వన మహోత్సవంతో పాటు మొక్కలు నాటడం, నీటి సంరక్షణ తదితర కార్యక్రమాల పురోగతిని రోజువారీగా “తెలంగాణ హరిత నిధి



నిర్వహణ సమాచార వ్యవస్థ–Telangana Green Fund Management Information System (TGFMIS)”లో నమోదు చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నిర్దేశించారు. “దేవాలయాల పరిధిలో, అలాగే దేవాదాయ శాఖకు చెందిన దేవాలయ భూముల్లో విస్తృతంగా మొక్కలు నాటేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. దేవాలయాల ఆధ్యాత్మిక ప్రాధాన్యతకు అనుగుణంగా ఆహ్లాదకరమైన, పచ్చదనంతో కూడిన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, దేవాలయ భూముల్లోనూ అందుబాటులో ఉన్న ప్రాంతాలను సద్వినియోగం చేసుకుని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి” అని మంత్రి కొండా సురేఖ అధికారులకు కార్యాచరణను నిర్దేశించారు. ర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వన మహోత్సవంలో భాగంగా అనుకున్న లక్ష్యాలను సాధిం చడంలో కొంత ఆలస్యం అయినందున ఈ లోటును పూడ్చడానికి ప్రత్యేక వనమహోత్సవం కార్యక్రమాన్ని విస్తృతంగా, ప్రజా ఉద్యమంగా, ఓ పండుగలా నిర్వహించేలా కార్యాచరణను అమలు చేయాలని మంత్రి సురేఖ అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పిసిసిఎఫ్ లకు సూచించారు.

# విద్యుత్ రంగ బలోపేతానికి పెద్దపీట

- **దావాజిపల్లిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం**

**వనపర్తి జిల్లా వెలుతురు ఆగస్టు 24:**

రాష్ట్రంలో విద్యుత్, రహదారులు, సాగునీటి మౌలిక వసతులను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా పాన్గల్ మండలం దావాజిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కొత్త సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు సరఫరా వ్యవస్థను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. రైతులు, గృహ, వాణిజ్య వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



### లో-వోల్టేజీ సమస్యలకు పరిష్కారం

దావాజిపల్లిలో 33/11 కేవీ ఉపకేంద్రం అందుబాటులోకి రావడంతో పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని మంత్రులు తెలిపారు. లో–వోల్టేజీ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు తగ్గడంతో పాటు సరఫరా వ్యవస్థపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ నాణ్యంగా అందడంతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.

### రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాంతంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మెరుగైన రహదారి సౌకర్యాలతో రైతులు తమ పంటలను మార్కెట్లకు సులభంగా తరలించేందుకు వీలవుతుందని, గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. రహదారుల అభివృద్ధి ద్వారా ప్రజలకు రవాణా ఇబ్బందులు తగ్గుతాయన్నారు.

### పర్యాటకంతో ఉపాధి అవకాశాలు

పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పర్యాటక మౌలిక వసతులు మెరుగుపడితే స్థానిక యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమివ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

### సాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం

సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రులు తెలిపారు. భవిష్యత్‌లో సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు. సాగునీటి వసతులు మెరుగుపడితే రైతులకు సాగు భరోసా పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్, రహదారులు, సాగునీరు, పర్యాటక రంగాల అభివృద్ధితో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని మంత్రులు అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు.



# మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి కృషి



- **క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్ల పై సమీక్షా సమావేశం .**
- **క్రిటికల్ కేర్ బ్లాక్ ను ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**మెదక్ వెలుతురు ఆగస్టు 24:**

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు మెదక్ జిల్లా కేంద్రం లోని నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్ ను స్థానిక శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ గారితో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్ల పై GGH ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సునీత దేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా నితిన్ కబ్రా, DMHO డా. జ్ఞానేశ్వర్, DCHS డా. శివ దయాళ్, వైద్య ఆరోగ్యశాఖ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమీక్ష లో పీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ శాసన సభ్యులు మైనంపల్లి హనుమంత రావు గార్లు పాల్గొన్నారు. క్రిటికల్ కేర్ బ్లాక్ ను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన HR ఎక్విప్మెంట్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, IHFMS సేవలను అందుబాటులోకి తేవడం పై రేపు (date. 25.08.2026) న హైదరాబాద్ సచివాలయం లో ఉన్నత స్థాయి సమావేశం కు రావాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు అధికారులను ఆదేశించారు. అలాగే,GGH ఆసుపత్రి లో వైద్య సేవల బలోపేతం పై మంత్రి చర్చించారు. GGH నూతన భవన నిర్మాణం పై చర్చించారు. మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్ నిర్మాణం పై చర్చించారు. తూప్రాన్ లో ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో నర్సాపూర్, రామాయంపేట, కొడిపల్లి, తూప్రాన్ లలో కిడ్నీ రోగులకు అందిస్తున్న డయాలసిస్ సేవలపై చర్చించారు. మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.



## సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో
# పలువురిని పరామర్శించిన మంత్రి సీతక్క





**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురిని మంత్రి సీతక్క పరామర్శించారు. పీజేఆర్ సతీమణి పి. ఇందిర, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సతీమణి ఆత్రం తులసిని కలిసి వారి ఆరోగ్య పరి స్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స వివరా లను తెలుసు కున్న మంత్రి సీతక్క, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి: TGHRC


**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (TGHRC) గౌరవ చైర్‌పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలపై HRC No.2638 of 2026, తేదీ 03.08.2026న కీలక ఆదేశాలు జారీ చేసింది.తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తగిన తరగతి గదులు, మరుగుదొడ్లు మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద, వరండాల్లో, కమ్యూనిటీ భవనాల్లో తరగతులకు హాజరవుతున్నారంటూ 03.07.2026న ‘సాక్షి’ తెలుగు దినపత్రికలో ప్రచురితమైన వార్త ఆధారంగా కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించింది.కమిషన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్, జనగాం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి నివేదికలు సమర్పించబడ్డాయి. ఆయా నివేదికలను పరిశీలించగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, మరమ్మతులు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్ల కొరత వంటి మౌలిక వసతుల లోపాలు ఉన్నట్లు వెల్లడైంది.నల్గొండ జిల్లా, నిడమనూరు మండలం, ఊట్కూర్ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా పరిశీలించినట్లు నివేదికలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా పాత రేకుల పైకప్పు తరగతి గదుల్లో లీకేజీలు ఏర్పడటంతో, మరమ్మతులు జరుగుతున్న సమయంలో విద్యార్థులను తాత్కాలికంగా చెట్ల కింద కూర్చోబెట్టి తరగతులు నిర్వహించినట్లు నివేదికలో వెల్లడించారు.విద్యార్థులకు సురక్షితమైన తరగతి గదులు, పారిశుధ్య సౌకర్యాలు, ఇతర ప్రాథమిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కమిషన్ స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21A ద్వారా కల్పించబడిన విద్యా హక్కు కేవలం పాఠశాలలో ప్రవేశం కల్పించడంతో పరిమితం కాదని, పిల్లలు సురక్షితమైన, గౌరవప్రదమైన, అనుకూలమైన వాతావరణంలో విద్యను అభ్యసించే పరిస్థితులు కూడా అందులో భాగమేనని కమిషన్ పేర్కొంది.

### అన్ని జిల్లాలపై సమగ్ర చర్యలు తీసుకోవాలి

కమిషన్ పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రాథమిక సౌకర్యాలపై నివేదికలు కోరాలని సిఫారసు చేసింది.అలాగే ఈ అంశాన్ని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి, ప్రభుత్వ పాఠశాలల్లో సురక్షితమైన తరగతి గదులు, పనిచేసే మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు, అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు తక్షణ మరియు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫారసు చేసింది.మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993లోని సెక్షన్ 18(e) ప్రకారం కమిషన్ చేసిన సిఫారసులపై తీసుకున్న లేదా ప్రతిపాదించిన చర్యల వివరాలను ఆరు నెలల్లోగా కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ సిఫారసులు, పరిశీలనలతో HRC No.2638 of 2026లో తదుపరి చర్యలను కమిషన్ ముగించింది.

# ప్రతి వ్యక్తి, ప్రతి ఇంటికి ఒక మొక్క అందించేలా విస్తృతంగా వన మహోత్సవ కార్యక్రమాలు చేపట్టాలి




- అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.

**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 24:**

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 56.46 శాతం మొక్కల పెంపకం పూర్తయిందని ఈ నెల 25న నిర్వహించనున్న ప్రత్యేక వన మహోత్సవ కార్యక్రమం ద్వారా నిర్దేశిత లక్ష్యానికి అదనంగా కనీసం 10 శాతం మేర మొక్కలు నాటేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి సూచించారు.వన మహోత్సవం కార్యక్రమం అమలు పై సోమవారం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జిల్లా వారీగా మొక్కలు నాటే లక్ష్యాలు ఇప్పటి వరకు సాధించిన పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 23వ తేదీ నాటికి రంగారెడ్డి జిల్లాలో 78.540 లక్షల మొక్కలు నాటే లక్ష్యానికి గాను 45.287 లక్షల మొక్కలు నాటి 57.66 శాతం సాధన నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా 1606.286 లక్షల మొక్కల లక్ష్యానికి గాను 906.853 లక్షల మొక్కలు నాటి 56.46శాతం సాధన నమోదైంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించి, "ఒక్క వ్యక్తికి ఒక మొక్క – ఒక్క ఇంటికి ఒక మొక్క" అనే విధంగా ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ ప్రజాప్రతి నిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వీఐపీలు, రైతులు, యువత, సామాజిక సంస్థలు, మీడియా ప్రతినిధుల ను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.

### దేవాలయాల్లో ప్రత్యేకంగా మొక్కలు నాటాలి

దేవాలయాలకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను గుర్తించి, ఆయా చెట్ల మొక్కలను సేకరించి దేవాలయ ప్రాంగణాల్లో నాటాలని మంత్రి సూచించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయంగా ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను సంరక్షించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.





### ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కల పంపిణీ

అన్ని నర్సరీల్లో తగినంత మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కల ను మాత్రమే పంపిణీ చేసి నాటించాలని అధికారులను ఆదేశించారు. మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, నాటడం, అనంతరం నీటి వసతి కల్పించడం వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

### పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్టులకు ప్రాధాన్యత

పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు అర్బన్ ఫారెస్టుల ఏర్పాటును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి పట్టణాల్లో పచ్చదనాన్ని మరింత పెంచాలని ఆదేశించారు. చెరువుల పరిసరాల్లో తాటి మొక్కల పెంపకం తాటి మొక్కలను చెరువుల పరిసర ప్రాంతాల్లో, అలాగే గౌడ సమాజానికి చెందిన భూముల్లో నాటేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి ఈ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో మొక్కల పెంపకంతో పాటు భూగర్భ జలాల పెంపుపై కూడా




ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. నీటి సంరక్షణకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ నీటి నిల్వ మరియు భూగర్భ జలాల పెంపునకు అవసరమైన గుంతలు, ఇతర చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, మొక్కలు నాటడం, నీటి సదుపాయం తదితర ఏర్పాట్లను పూర్తిచేసి కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే. కిరణ్మయి, జిల్లా అటవీ అధికారి (DFO) శివ ఆశిష్ సింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి , డి.ఈ.ఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మంచి రోడ్లు వేయాలనేది మా ప్రభుత్వ లక్ష్యం..

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వములో మా ప్రభుత్వం రోడ్ ఇన్ఫ్రా కోసం అత్యధికంగా ఖర్చు చేస్తున్నాం..
- నా చిరకాల మిత్రుడు సహచర మంత్రి జూపల్లి కృష్ణారావు గారు కొల్లాపూర్ అభివృద్ధి కోసం ఎంతో తపన పడతారు..
- కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి సభలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి:

**నాగర్ కర్నూల్ జిల్లా వెలుతురు ఆగస్టు 24:**

ఆర్ అండ్ బి,పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో హ్యామ్ రోడ్ల నిర్మాణం చేస్తున్నాం..ఇవాళ ఒక్కరోజే అచ్చంపేటలో 146.71కోట్లు,కొల్లాపూర్ నియోజకవర్గంలో దావాజిపల్లి 42కోట్లు,వీపనగండ్ల 30 కోట్లు,పెద్ద దగడ 46 కోట్లు,చిన్నంబావి 39 కోట్లు,పెంట్లవల్లి 172 కోట్లు మొత్తం 474 కోట్ల హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశాం.కేసీఆర్ పాలమూరు ఎంపీగా ఉన్న కూడా...ఈ ప్రాంతంపై తీవ్ర నిర్లక్ష్యం చేశాడు.

- కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిండు... కూలగొట్టిండు..
- తనను రాజకీయంగా ఆదరించిన పాలమూరు జిల్లాకు పాలమూరు ప్రాజెక్ట్ పడావు పెట్టాడు..
- ఆయన ఫాం హౌస్ కు నీళ్ళు ఇచ్చుకున్నాడు..దాని కోసం ప్రాజెక్టులు కట్టుకున్నాడు..కానీ పాలమూరు కోసం ఆలోచన చేయలేదు..
- జూపల్లి గారు,నేను తెలంగాణ ఉద్యమంలో మంత్రి



పదవులకు రాజీనామా చేశాం..పిల్లల ప్రాణాలు పోతుంటే చూస్తూ ఊరుకోలేదు..

- సోనియాగాంధీ గారిని ఒప్పించాం..
- మాకు ఎప్పుడూ తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం..
- అందుకే పాలమూరు ప్రజలు,నల్లగొండ ప్రజలు కాంగ్రెస్ కు బ్రహ్మరథం పట్టారు..
- ఎంపీ మల్లు రవి గారు ఈ ప్రాంత ప్రజల గొంతుకగా నిలుస్తున్నారు
- రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి గారితో మంత్రులందరం సమష్టిగా పనిచేసి అన్ని హామీలు నెరవేర్చి,ప్రజల ఆశీర్వాదం పొందుతాము..

# పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల పరిహారం వెంటనే అందించాలి



ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వర్ రావు గారిని ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పంట నష్ట పరిహారం అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే హామీ ఇచ్చి ఇంతకాలం గడిచినా బాధిత రైతులకు పరిహారం అందకపోవడం దురదృష్టకరమని పాయల్ శంకర్ గారు అన్నారు.ఇప్పటికే పంట నష్టంతో ఆర్థికంగా చితికిపోయిన రైతులు అప్పు లు తీర్చలేక, తదుపరి పంటకు పెట్టుబడులు సమకూర్చుకోలేక తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని కేవలం ప్రకటనకే పరిమితం చేయకుండా ఎకరానికి రూ.10 వేల చొప్పున నష్టప రిహారాన్ని తక్షణమే విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను వెంటనే అమలు చేసి, భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయే రైతులకు పటిష్టమైన బీమా రక్షణ కల్పించాలని కోరారు.రైతులతో కలిసి సచివాలయం బయట నినాదాలు చేస్తూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పాయల్ శంకర్ గారు, "రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.. పంట నష్ట పరిహారం వెంటనే విడుదల చేయాలి.. తెలంగాణలో ఫసల్ బీమా అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు.ఆదిలాబాద్ రైతులకు న్యాయం పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారు స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ న్యాయ సేవలకు హైదరాబాద్ వేదిక


- 'కావేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్'ను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 24:**

అంతర్జాతీయ న్యాయ నైపుణ్యాన్ని కృత్రిమ మేధ (Artificial Intelligence–AI) సాంకేతికతతో అనుసంధానం చేస్తూ, వివిధ దేశాలకు సంబంధించిన న్యాయ సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'కవేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్' హైదరాబాద్ కార్యాలయాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అంతర్జాతీయ న్యాయ సేవలకు సంబంధించిన వినూత్న సంస్థ హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వృత్తిపరమైన సేవలతో సహా అనేక రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం వేగంగా విస్తరిస్తోందని, ఇది అపారమైన అవకాశాలను సృష్టిస్తూనే కొత్త సవాళ్లను కూడా ముందుకు తెస్తోందన్నారు. అందువల్ల ఏఐ వినియోగంలో బాధ్యత, నైతిక విలువలు, పారదర్శకత అత్యంత కీలకమని పేర్కొన్నారు.బలమైన ఐటీ, సాంకేతిక వ్యవస్థ, అత్యున్నత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ దేశాలతో మెరుగైన అనుసంధానం హైదరాబాద్‌కు ప్రత్యేక బలాలని మంత్రి చెప్పారు. ఈ అనుకూలతలతో ఏఐ ఆధారిత ప్రొఫెషనల్, న్యాయ సేవలకు హైదరాబాద్ ఒక ప్రధాన అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. తెలంగాణను అంతర్జాతీయ నైపుణ్యంతో అనుసంధానించే ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్రానికి ప్రపంచ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకొస్తాయని అన్నారు.న్యూయార్క్‌లోని కవేటి లా ఫర్మ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ అటార్నీ డాక్టర్ శ్రీనివాస్ రావు కవేటి, కవేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్‌ను హైదరాబాద్‌కు తీసుకురావడాన్ని మంత్రి అభినందించారు. తెలంగాణకు చెందిన డాక్టర్ కవేటికి భారత్‌తో పాటు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, కెనడా, యూఏఈ దేశాలకు సంబంధించిన అంతర్జాతీయ న్యాయ వ్యవహారాల్లో 35 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది.హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని 'ఇంటర్నేషనల్ లీగల్ యాక్సెస్ హబ్' గా తీర్చిదిద్దాలని సంస్థ ప్రతిపాదించింది. భారత్‌లోని వ్యక్తులు, వ్యాపార సంస్థలు, ప్రవాస భారతీయులు (NRIs), పెట్టుబడిదారులు వివిధ దేశాల్లో న్యాయ సేవలు అందిస్తున్న న్యాయవాదులు, న్యాయ నిపుణులతో అనుసంధానం కావడానికి ఈ కేంద్రం వేదికగా పనిచేయనుంది. అంతర్జాతీయ న్యాయ నిపుణులు హైదరాబాద్‌కు వచ్చిన సందర్భాల్లో ప్రత్యక్ష సంప్రదింపులు, న్యాయ వ్యూహాలకు సంబంధించిన సమావేశాలు నిర్వహించే అవకాశాన్ని కూడా కల్పించనున్నారు.సంస్థ సేవలు వివిధ దేశాల్లోని పలు న్యాయ విభాగాలను కవర్ చేయనున్నాయి. అమెరికాలో ఇమ్మిగ్రేషన్, కుటుంబ చట్టాలు, సివిల్ లిటిగేషన్, అంతర్జాతీయ విడాకులు, కార్పొరేట్, క్రిమినల్ లా అంశాలు; యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇమ్మిగ్రేషన్, కుటుంబ చట్టాలు, సివిల్ లిటిగేషన్; యూఏఈలో కార్మిక పరిహారం, ఉద్యోగ సంబంధిత సమస్యలు, ఒప్పంద వివాదాలకు సంబంధించిన సేవలను అందించనున్నట్లు సంస్థ తెలిపింది. భారత్‌లో కంపెనీ, ట్రేడ్‌మార్క్ చట్టాలు, సివిల్, క్రిమినల్, కార్మిక చట్టాలు, రిట్ పిటిషన్లు, రుణాల రికవరీ, వినియోగదారుల చట్టాలు, స్పెషల్ లీవ్ పిటిషన్లు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలకు సంబంధించిన సేవలను అందించనుంది.హైదరాబాద్ కేంద్రం కార్యకలాపాల్లో న్యాయ సేవల్లో కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా వినియోగించడం ప్రధాన అంశంగా ఉండనుంది. ముఖ్యంగా సంక్లిష్టమైన అంతర్జాతీయ న్యాయ వ్యవహారాల్లో లీగల్ రీసెర్చ్, సమాచార సేకరణ, డాక్యుమెంట్ల విశ్లేషణ, డిస్కవరీ, కేసులకు సంబంధించిన ప్రాథమిక మ్యాపింగ్ తదితర అంశాల్లో ఏఐ సహకారాన్ని వినియోగించాలని ప్రతిపాదించారు.అయితే ఏఐ న్యాయవాదులకు ప్రత్యామ్నాయం కాదని, వారికి సహకరించే సాధనంగా మాత్రమే ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. న్యాయ సలహాలు, ప్రాతినిధ్యం వంటి సేవలను ఆయా దేశాల్లో అమలులో ఉన్న చట్టాలు, వృత్తిపరమైన నైతిక ప్రమాణాలకు అనుగుణంగా అర్హత కలిగిన న్యాయ నిపుణులు మాత్రమే అందిస్తారని పేర్కొంది.సాంకేతిక పరిజ్ఞానం అంతిమంగా ప్రజలకు ఎదురయ్యే అడ్డంకులను తగ్గించడానికి, సేవల్లో సామర్థ్యాన్ని పెంచడానికి, ప్రత్యేక నైపుణ్యంతో కూడిన సేవలను మరింత విస్తృత వర్గాలకు చేరువ చేయడానికి ఉపయోగపడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచస్థాయి ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌లతో అనుసంధానించే ఇటువంటి సంస్థలు తెలంగాణను ఆవిష్కరణలు, విజ్ఞాన ఆధారిత సేవలకు అంతర్జాతీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడంలో దోహదపడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



# ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది



హాజరైన శాసన పరిషత్ చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ గారు.హాజరైన లెజిస్లేచర్ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు గారు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్.హాజరైన శాసనమండలి SC వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం గారు, సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య.హాజరైన శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి. ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో అభినందనలు తెలిపిన చైర్మన్, స్పీకర్ గార్లు మరియు సెక్రటరీలు ఈసందర్భంగా చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ ..ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది, ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడ డంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం మానిటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలి.మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి అంశా లను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నది.క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలి. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ...నేను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించాను. తెలంగాణ ఎప్పటినుంచో "గంగా– జమున తెహజీబ్" కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లి ములు, క్రిష్టియన్లు , ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతు లను పంచు కుంటూ, అన్నింటికంటే ముఖ్యం గా ప్రేమ, విశ్వా సాలతో ముం దుకు సాగుతున్నారు.రాష్ట్ర జనా భాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, ప్రాథమిక అవసరాలను గుర్తించి, అందు కు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలి. కమి టీ సభ్యులు తమ అనుభవం, అధికారుల తో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్ధేశిం చిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడినల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను.

# రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ప్రజావాణికి 53 ఫిర్యాదులు

- **ప్రజావాణిలో ప్రజలు ఫిర్యాదులు చేసిన సమస్యలు వివిధ శాఖల అధికారులు**
- **వెంటనే పరి ష్కరించాలి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి**



**ఇబ్రహీంపట్నం వెలుతురు ఆగస్టు 24:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగర కలాన్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సమీకృత జిల్లాకార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి53ఫిర్యాదు లు అందాయి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి సమస్యల ను జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కిరణ్మయి అదనపు కలెక్టర్ చం ద్రారెడ్డితో కలిసి అర్జీలు స్వీకరించారు ఈసందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజా వాణి కార్యక్రమంలో ప్రజలుఅందిం చే వినతు లను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూశాఖ 26ఇతర శాఖలు 27 మొత్తం53 దరఖస్తులు అందాయి ఈ కార్యక్రమంలో జిల్లారెవెన్యూ అధికారి శారదా దేవి శాఖల జిల్లా అధికారులు కలెక్టరేట్ సూ ప రింటెండెంట్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఘనంగా పూజలు



**శంకర్పల్లి, వెలుతురు ఆగస్టు 24 :** పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకొని చిన్న శంకర్పల్లి గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి ఆలయంలో పూజలు, అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగాయి. శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ వేడుకల్లో బుల్కాపూర్ కౌన్సిలర్ కృష్ణ ప్రత్యేకంగా పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు మరియు అభిషేకాలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆయన ఈ సందర్భంగా ప్రార్థించారు.పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ కృష్ణ స్వయంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పరిసరాలు భక్తిస్మరణలతో మారుమోగాయి.

# నిషేధిత జాబితా ఉచ్చులో సామాన్యుల భూములు

- **ప్రభుత్వం తక్షణమే స్పందించాలి**
- **బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు బద్దం శశిధర్ రెడ్డి డిమాండ్**



**శంకర్ పల్లి, వెలుతురు ఆగస్టు 24 :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన 22ఏ (రిజిస్ట్రేషన్ల నిషేధిత భూముల జాబితా) నిబంధన వల్ల మున్సిపాలిటీ పరిధిలోని వందలాది మంది ప్రైవేట్ భూముల యజమానులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు పెద్దమ్మ శశిధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా తమ సొంత హక్కులతో, పక్కా పత్రాలతో అనుభవిస్తున్న పట్టా భూములను, ప్రైవేట్ ఆస్తులను సైతం అధికారులు నిబంధనలకు విరుద్ధంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమన్నారు. దీనివల్ల అత్యవసర సమయాల్లో, పిల్లల చదువులకో, పెళ్లిళ్లకో లేదా వైద్య ఖర్చులకో భూములను అమ్ముకుందామన్నా రిజిస్ట్రేషన్లు కాక సామాన్య, మధ్యతరగతి ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని మండిపడ్డారు.

### అధికారుల నిర్లక్ష్యమే కారణం

రెవెన్యూ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన లోపం, నిర్లక్ష్యం వల్లే ఈ సమస్య తలెత్తిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూములతో పాటు పక్కనే ఉన్న ప్రైవేట్ సర్వే నంబర్లను కూడా నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల కొనుగోలుదారులు, అమ్మకందారులు ఇద్దరూ నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని, సామాన్యులపై ఈ రకమైన భారం మోపడం సరికాదని హితవు పలికారు.

### ప్రభుత్వానికి డిమాండ్

ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం స్పందించి తక్షణమే ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. 22A జాబితాను పునఃసమీక్షించి, బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, అర్హులైన ప్రైవేట్ భూయజమానుల ఆస్తులను ఆ జాబితా నుండి తక్షణమే తొలగించాలని కోరారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# శ్రీ సోమనాథ క్షేత్రంలో శతక పారాయణం



**చౌటుప్పల్ వెలుతురు ఆగస్టు 24:** ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆయురారోగ్యాలు పెరిగేందుకు, మానసిక వికాసం పొందేందుకు శ్రీ సోమనాథ మహర్షి రూపొందించిన "మనోయోగ సాధన_ ప్రకృతి శక్తి ప్రయోగం" ఉపయోగపడుతుందని చౌటుప్పల్ లోని శ్రీ సోమనాథ క్షేత్రం అధ్యక్షుడు బడుగు నరసింహ తెలిపారు. స్థానిక మారుతీ నగర్ లోని శ్రీ సోమనాథ క్షేత్రంలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు "శతక పారాయణం" చేశారు. సోమనాథ మహర్షి రచించిన 142 పద్యాలను ఆలాపించారు సోమనాథ మహర్షి విగ్రహానికి పూలమాలలు సమర్పించి హారతులు పట్టారు. క్షేత్ర కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పిడి రామ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సుభాష్ చారి, కార్యదర్శి గట్టు ప్రభాకర్, కోశాధికారి కృష్ణమూర్తి భక్తులు పాల్గొన్నారు.

# పద్మానగర్ ఫేజ్–1 నీటి సమస్య కు శాశ్వతంగా పరిష్కరిస్తానన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి ఆగస్టు 24:** జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్–1 కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అధికారులను కోరారు.సోమవారం కాలనీని సందర్శించిన ఆయన, స్థానికులతో మాట్లాడి నీటి సరఫరా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ మాధవిని ని కలిసి సమస్యను వివరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలని కూన శ్రీశైలం గౌడ్ కోరారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు మరియు డివిజన్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం రాజేందర్ రెడ్డి, దుర్గా రావుతో పాటు స్థానిక కాలనీవాసులు ముత్యాలు, శివ నాగిరెడ్డి, మోహన్ సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, వేణు, సత్యం, సురేందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# దాద్ పల్లి గ్రామంలో శ్రీ శ్రీ పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఘనంగా జరిగాయి

- **పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన గ్రామసర్పంచ్ నేనావత్ శాంతి రాజునాయక్,**
- **మాజీ సర్పంచ్ నర్సింగ్ అనిత, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్ గౌడ్**



**మంచాల వెలుతురు ఆగస్టు 24:** మంచాల మండలం దాద్ పల్లి గ్రామంలో ఆదివారము రాత్రి శ్రీ శ్రీ పోచమ్మఅమ్మవారి దేవత బోనాల ఉత్సవాలు గ్రామసర్పంచ్ నేనావత్ శాంతి రాజు నాయక్ గ్రామపంచాయతీ పాలక మండలి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా డప్పు చప్పులతో బ్యాండ్ వాయి ద్యాలతో ఘనంగానిర్వహించి పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి అనంతరం గ్రామ స ర్పంచ్ నేనావత్ శాంతి రాజునాయక్ మాజీసర్పంచ్ నర్సింగ్ అనిత మాజీ వైస్ఎంపీపీనర్సింగ్ వెంకటేష్ గౌడ్ గ్రామస్తులతో కలిసి పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బాగావర్షాలు కు రవాలి రైతులు ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని పోచమ్మ అమ్మవారినిమొక్కుకున్నారు బోనాల ఉత్సవాలో మాహిళలు యువకులు గ్రామపెద్దలు మాజీ ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలు మొక్కులు సమర్పించారు కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కావేటి నరసింహారావు గ్రామపంచాయతీ వార్డుసభ్యులు నేనావత్ పార్వతి నేనావత్ సునీత మామిడిపల్లి పరమేష్ పెద్దగౌడ సిద్ధగోని శ్రీనివాస్ గౌడ్ నేనావత్ నరేష్ రాజేష్ జాటోత్ గోపి గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆరుట్ల శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో గౌడ సంఘం పెద్దల సహకారంతో శివ స్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

- **25వ సోమవారం అన్నదాన ప్రభువు శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజు గౌడ్**



ఆరుట్ల గ్రామంలో కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



ఆరుట్ల కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న శ్రీ మహాలక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజు గౌడ్ ఝాన్సీ దంపతులు

**మంచాల వెలుతురు ఆగస్టు 24:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి సోమవారం గౌడ సంఘం పెద్దల సహకారంతో దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగ రి యాదగిరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు25వసోమవారం రోజుశ్రీమహా లక్ష్మి సిండికేట్ గ్రూప్ అధ్యక్షుడు అంతటి రాజుగౌడ్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు ముందుగా అంతటి రాజుగౌడ్ ఝాన్సి దంపతులు గౌడ సంఘం అధ్యక్షుడు తంగడిప ల్లి నరేందర్ గౌడ్ ఉపాధ్యక్షుడు సుంకరి ప్రవీణ్ గౌడ్ భక్తులతో కలిసి శివలింగానికి కంఠమహేశ్వ ర స్వామికి ప్రత్యేక పూజలుచేసి అనంతరం భక్తులకుఅన్నదాన కార్యక్రమం ప్రారంభించారు అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున హాజరై అన్నదాన ప్రసాదం స్వీకరించారు ఈకార్యక్ర మంలో గౌడ సంఘం పెద్దలు మాడుగుల కృష్ణగౌడ్ సుంకరి జంగయ్యగౌడ్ ఇబ్రహీంపట్నంమార్కె ట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ ఇందిరమ్మకమిటీ సభ్యుడు చెరుకు నరసింహగౌడ్ సిద్ధగొని ర మేష్ గౌడ్ పల్లె శ్రీనివాస్ గౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ నూకం బాలరాజ్ ముదిరాజ్ కొత్తపల్లి శేఖర్ గౌడ్ దూసరి రాజు గౌడ్ ఆమంచ సంతోష్ మాడపాకులకృష్ణ పాల్గొన్నారు.




https://epaper.velthuru.com
మంగళవారం,25 ఆగస్టు 2026

# బస్టాండ్ ఉన్నా.. రోడ్డుపైనే బస్సుల కోసం ఎదురుచూపులు!

- **గుండాల బస్టాండ్ భవనం నిరుపయోగం.. ప్రయాణికులకు తప్పని తిప్పలు!**
- **లక్షలు ఖర్చు.. ఉపయోగం శూన్యం! గుండాల బస్టాండ్ దుస్థితి**
- **రోడ్డుపైనే మహిళలు, వృద్ధులు, విద్యార్థుల నిరీక్షణ.. అధికారుల తీరుపై ప్రజాగ్రహం**



**గుండాల, ఆగస్టు 24 (వెలుతురు ):**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో నూతన బస్టాండ్ భవనం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. ప్రయాణికులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో అట్టహాసంగా నిర్మించిన బస్టాండ్ భవనం అందుబాటులో ఉన్నప్పటికీ, ఆర్టీసీ బస్సులు మాత్రం లోపలికి రాకపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సౌకర్యం కల్పించాల్సిన బస్టాండ్.. ఇప్పుడు అలంకారప్రాయంగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు. బస్సుల కోసం ప్రయాణికులు ప్రధాన రహదారిపైనే నిలబడాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ఎండ, వానలను లెక్కచేయకుండా రోడ్డుపైనే బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. రద్దీ సమయంలో రహదారిపై ప్రయాణికులు నిలబడటం వల్ల ప్రమాదాల భయం కూడా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**"ప్రజాధనం ఖర్చు చేసి.. ఉపయోగం లేకపోతే ఎందుకు?"**

గత ప్రభుత్వం ప్రజాధనంతో నిర్మించిన నూతన బస్టాండ్ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులు, అధికారులపై ఉందని స్థానికులు అంటున్నారు. భవనం నిర్మాణానికి నిధులు కేటాయించగలిగినప్పుడు.. దానిని వినియోగంలోకి తీసుకురావడంలో ఇంత జాప్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లు గడుస్తున్నా గుండాల బస్టాండ్ సమస్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి నిత్యం వివిధ గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుండటంతో బస్టాండ్ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ప్రజల కోసం నిర్మించిన భవనం ప్రజలకే ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని, ఇకనైనా నిర్లక్ష్యం వీడి బస్టాండ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గుండాల ప్రజలు కోరుతున్నారు.



# యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏసీబీ అధికారుల దాడులు

- **రూ.14 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రెవెన్యూ అధికారులు**

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆగస్టు 24 (వెలుతురు ):**

- **యాదాద్రి భువనగిరి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు.**
- **కోలనుపాకలో ల్యాండ్ కన్వర్షన్ వ్యవహారంలో లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు.**
- **రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్‌తో పాటు గ్రామ పంచాయతీ రెవెన్యూ అధికారి లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం.**
- **డిమాండ్ చేసిన లంచంలో భాగంగా రూ.14 వేల నగదు తీసుకుంటుండగా, ఆలేరు ఎంఆర్వో కార్యాలయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం.**
- **ఇద్దరు రెవెన్యూ అధికారులను అదుపులోకి తీసుకున్న ఏసీబీ**



**అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.**

- **ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.**

# ఫీజు రీయింబర్స్‌మెంట్ దీక్ష కు మద్ధతు తెలిపిన ప్రైవేటు డిగ్రీ & పీజీ కళాశాల ల మేనేజ్మెంట్ అసోసియేషన్

**మోత్కూర్, ఆగస్టు 24,వెలుతురు :**
విద్యార్థుల పట్ల రేవంత్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఎండగడుతూ, రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ 2 రోజుల నిరాహార దీక్ష చేపట్టనున్న తెలంగాణ బిజెపి అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు గారికి మద్దతు గా ఈ రోజు బీజేపీ ఆఫీసు లో తెలంగాణ ప్రైవేటు డిగ్రీ & పీజీ కళాశాల ల మేనేజ్మెంట్ అసోసియేషన్ కలిసి మద్దతు ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా 14 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును గందరగోళంలో పడేసిన ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రెసిడెంట్ సూర్యనారాయణ రెడ్డి, మహాత్మా గాంధీ యూనివర్సిటీ ప్రెసిడెంట్ సెక్రటరీ టి.శ్రీనివాసరెడ్డి, సి హెచ్.సత్యంగౌడ్,భాస్కరరావు, హనుమంతు యాదవ్,తదితరులు పాల్గొన్నారు.



# మహమ్మద్ ఇబ్రహీం సంతాప సభలో పాల్గొన్న దైద రవీందర్

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 24:**
మండల కేంద్రానికి చెందిన ఆంధ్రజ్యోతి పాత్రికేయులు ఇటీవల మృతి చెందిన మహమ్మద్ ఇబ్రహీం సంతాప సభ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి గురించి ప్రసంగించిన 51 సంవత్సరాల పాత్రికేయ వృత్తిని కొనియాడుతూ పాత్రికేయులను ఉద్దేశించి మాట్లాడిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి , రామన్నపేట మండలం పాత్రికేయులు & అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.



# సాగునీటి ప్రాజెక్ట్ లు పూర్తి చెయ్యాలి




- **సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్**

**మోత్కూర్ ఆగస్టు 24, వెలుతురు :**
యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, కాలువల పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ పనులకు తక్షణమే నిధులు విడుదల చేసి, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 29, 30 తేదీల్లో భువనగిరి నుంచి హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వరకు పాదయాత్ర, 31న రైతులు, ప్రజలతో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం మోత్కూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాలువల పనులు ఏళ్లుగా నత్తనడకన సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. 2006లో ప్రారంభమైన బునాదిగాని కాలువ మక్తా అనంతారం నుంచి సుమారు 98 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉండగా, సుమారు 750 ఎకరాల భూసేకరణలో ఇంకా 500 ఎకరాలు పెండింగ్‌లో ఉందన్నారు. 150కుపైగా కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా 34 మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. రూ.266 కోట్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఫైనాన్స్ కమిటీ ఆమోదం లభించక పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు.ఈ కాలువల ద్వారా బీబీనగర్, భువనగిరి, వలిగొండ, ఆత్మకూరు, మోత్కూర్, అడ్డగూడూరు, మోటకొండూరు మండలాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. 2003లో ప్రారంభమైన ధర్మారెడ్డిపల్లి కాలువను వలిగొండ వరకు వెడల్పు చేసి వదిలేశారని, నార్కట్‌పల్లి మండలం ఏ పి లింగోటం వరకు పొడిగించాల్సిన పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయని అన్నారు. 2005లో ప్రారంభమైన పిలాయిపల్లి కాలువ వెడల్పు పనుల్లో ఇంకా 12 కల్వర్టులు నిర్మించాల్సి ఉందని, నిధులు లేక పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు. బస్వాపురం ప్రాజెక్టు కింద నిర్వాసితులకు నష్టపరిహారం కోసం రూ.420 కోట్లు అవసరం కాగా రూ.206 కోట్లు మాత్రమే విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి రూ.450 కోట్ల అంచనా ఉండగా రూ.80 కోట్లు మాత్రమే విడుదల చేస్తున్నారని తెలిపారు. ఇందిరానగర్, వీరారెడ్డిపల్లి ప్రాంతాల రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.రూ.6,200 కోట్ల అంచనాతో చేపట్టిన శివన్నగూడెం ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.1,500 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని తెలిపారు. నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు కృష్ణా జలాలు అందించేందుకు రాచకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చేపట్టాల్సి ఉన్నా అది ప్రతిపాదనలకే పరిమితమైందన్నారు. రిజర్వాయర్ నిర్మాణంతో ఆయా ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.గుండాల మండలంలో దేవాదుల నుంచి నవాబ్‌పేట మీదుగా నీటిని తీసుకువస్తామని చెప్పి 15 ఏళ్లు గడిచినా కాలువలు పూడిక, గడ్డితో నిండిపోయి శిథిలావస్థకు చేరాయని అన్నారు. ఆలేరు ప్రాంతంలోని పటేల్‌గూడెం, తంగటూరు ప్రాంతాల్లో అశ్వరావుపల్లి, దేవాదుల నీటి కోసం తవ్విన కాలువలు కూడా ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. బృందావన్, ఆసిఫ్‌నహర్ కాలువల షట్టర్లు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, పెండింగ్ ప్రాజెక్టులు, కాలువలకు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కోరారు. తొమ్మిది ప్రధాన డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న చలో హైదరాబాద్ పాదయాత్ర, మహాధర్నాలో రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాద గిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పైళ్ల యాదిరెడ్డి, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, టౌన్ కమిటీ సభ్యులు కూరపాటి రాములు, కందుకూరి నర్సింహా, పాల్గొన్నారు.

# ఇబ్రహీం మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటు

- **నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం**

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 24:**
పాత్రికేయ రంగానికి సీనియర్ జర్నలిస్టు ఎండి ఇబ్రహీం మృతి తీరనిలోటు అని నకరికల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. సోమవారం రామన్నపేట పాత్రికేయ బృందవ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇబ్రహీం సంతాప సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. పాత్రికేయ రంగంలో 50 సంవత్సరాలు పైగా ఒకే పత్రికలో పనిచేసిన గొప్ప వ్యక్తి ఎంపీ ఇబ్రహీం అని కొనియాడారు.ఎవరితోనూ విభేదాలు లేకుండా అందర్నీ కలుపుగోలుగా కలుపుకొని అందరి మండల లో పొందిన వ్యక్తి ఇబ్రహీం ఒక్కరేనని అన్నారు. 2018 నుండి తనకు ఎంతో సానిహితంగా ఉంటూ ఎప్పటికప్పుడు తనతో మాట్లాడుతూ పలు సమస్యలపై చర్చించేవారు. అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయన మృతిని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. సీనియర్ పాత్రికేయ రంగంలో ప్రతి ఒక్కరికి సహాయ సహకారాలు అందిస్తు పాత్రికేయ రంగంలో నిబద్ధత కలిగిన వ్యక్తి ఇబ్రహీం ఒక్కరేనని కొనియాడారు. ఆయన మృతి ప్రతి ఒక్కరికి తీరనిలోటని ఎల్లవేళలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు



పున్న జగన్మోహన్, సిరిగి రెడ్డి మల్లారెడ్డి, ఎండి జమీరుద్దీన్, గంగుల వెంకట రాజారెడ్డి, పూస బాలకిషన్, పోచబోయిన మల్లేశం, ఉట్కూరి నరసింహ, బొడ్డుపల్లి వెంకటేశం, వనం చంద్ర శేఖర్, మీర్జా ఫజల్ బేగ్, గోదాసు పృథ్వీరాజ్, ఎండి రెహాన్, ఎండి అక్రమ్, మిర్యాల మల్లేశం, సాల్వేర్ అశోక్, కందుల హనుమంతు, మండల పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కళ అద్భుతం



- **మిస్ ఏసియా, చేనేత బ్రాండ్ అంబాసిడర్ రశ్మి ఠాకూర్**

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు ఆగస్టు 24:**
ఇక్కడి చేనేత కార్మికుల కళా నైపుణ్యం అద్భుతమని మిస్ ఆసియా ఇంటర్నేషనల్ ఇక్కత్ బ్రాండ్ అంబాసిడర్ రష్మీ ఠాకూర్ అన్నారు. మండలంలోని పుట్టపాక, నారాయణపురం గ్రామాలలో సోమవారం రశ్మి ఠాకూర్ పర్యటించారు. పుట్టపాకలో చేనేత క్లస్టర్ భవనంలో, నారాయణపురం చేనేత సహకార సంఘంలో చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం చేనేత పరిశ్రమ ఏ విధంగా నడుస్తుంది అన్న వివరాలను కార్మికుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. చేనేత పరిశ్రమను అభివృద్ధి పరచడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలనే దానిపై కార్మికుల సలహాలు సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా రష్మి ఠాకూర్ మాట్లాడుతూ ఇక్కడి చేనేత వస్త్రాలు ఎంతో ప్రఖ్యాతిగాంచాయని ఆమె తెలిపారు.



ఇక్కడ చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలను తాను ధరించడం వల్లనే తనకు ఇంతటి గౌరవం గుర్తింపు లభించిందని ఆమె పేర్కొన్నారు. త్వరలో బ్రిటన్ పార్లమెంట్లో జరిగే కార్యక్రమానికి చేనేత విభాగం తరపున తన ఆహ్వానించారని ఆమె తెలిపారు. అందులో భాగంగానే పలు ప్రాంతాలలో పర్యటించి చేనేత కార్మికులతో సమావేశం అవుతున్నానని, కార్మికులతో మమేకమై చేనేత వస్త్రాల తయారీ అభివృద్ధికి సంబంధించి అమూల్యమైన విషయాలను వారి నుంచి తెలుసుకుంటున్నానని ఆమె అన్నారు. చేనేత నిపుణులు కార్మికుల ద్వారా తెలుసుకున్న విషయాలన్నింటిని పరిశీలనలోకి తీసుకొని బ్రిటన్ పార్లమెంట్లో ప్రస్తావించి ఎక్కడి చేనేత పరిశ్రమకు మరింత ఖ్యాతిని తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఆమె అన్నారు. దీఇక్కడి చేనేత కార్మికుల కళా నైపుణ్యం అద్భుతంగా ఉందని ఆమె ప్రశంసించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నిత్యం నూతన డిజైన్లు టెక్నాలజీని అందిపుచ్చుకొని వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా కార్మికులు మరిన్ని వస్త్రాలను ఆవిష్కరించాలని ఆమె సూచించారు. చేనేత రంగంలో కూడా ఏఐ టెక్నాలజీని వినియోగించుకోవాలని రష్మీ ఠాకూర్ కోరారు .

ఈ కార్యక్ర మంలో పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం అంజయ్య గజం గోవర్ధన్, సర్పం చ్ గజం అనిత సత్యనారాయణ, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు చిలుకూరి శ్రీనివాస్ గజం సత్యనారాయణ కొలను సుజాత తడక యాదగిరి గజం గురునాథం చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు సవరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియపై అధికారులు సమావేశం నిర్వహించారు. ఆర్డీవో దేవుజా ఆధ్వర్యంలో తహసిల్దార్ దశరథ్, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, బీఎల్వోలు, బీఎల్ఏలతో సమావేశమై 2002 ఓటరు జాబితాలో మ్యాపింగ్ కాని అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియపై సూచనలు చేశారు.అనామలీస్ జాబితాలోని ఓటర్లకు పది రోజులపాటు బీఎల్వోలు వ్యక్తిగతంగా వెళ్లి నోటీసులు అందించాలని ఆర్డీవో సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సెప్టెంబర్ 16వ తేదీలోగా తమ అభ్యంతరాలను తెలియజేయాలని తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి అక్టోబర్ 15వ తేదీ వరకు పరిష్కరించనున్నట్లు చెప్పారు. అనంతరం అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని ఆర్డీవో అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరుకు అవకాశం కల్పించేలా అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు.

# 43వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 24:**



కరీంనగర్ నగర పాలక సంస్థ 43వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ.. నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందించేందుకు అవసరమైన అభివృద్ధి పనులను దశల వారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పొన్నం లక్ష్మి మొండయ్య గారు, కార్పొరేటర్లు తోట అనిల్, APP చంద్ర గారు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదల,

# విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ సమరభేరి..

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నిరాహార దీక్షకు సంఘీభావంగా , రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కరీంనగర్‌లో నిరసన దీక్ష చేపట్టిన బిజెపి జిల్లా శాఖ...
- ఫీజు రియంబర్స్మెంట్ బిక్ష కాదు.. విద్యార్థుల హక్కు...
- బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం




**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. ఇందులో భాగంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో హైదరాబాదులో ఆగస్టు 24, 25 తేదీల్లో చేపడుతున్న రెండు రోజుల నిరాహార దీక్షకు సంఘీభావంగా.. కరీంనగర్ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజున కరీంనగర్ బస్టాండ్ అవుట్ గేట్ ఎదురుగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసన దీక్ష చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయి ల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి నిర్లక్ష్యం వల్ల లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులు అర్ధాంతరంగా ఆగిపోయే ప్రమాదం ఏర్పడిందని మండిపడ్డారు. కాలేజీ యాజమాన్యాలు ఫీజుల చెల్లింపు కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తుండటంతో సర్టిఫికెట్లు అందక, పరీక్షలకు హాజరుకాక విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదని, అది విద్యార్థుల హక్కు అని , ప్రభుత్వం తక్షణమే స్పందించి పేరుకుపోయిన బకాయిలన్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "విద్యార్థుల హక్కుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడి బకాయిలను విడుదల చేయకపోతే, రాబోయే రోజుల్లో రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి , ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, అడిచెర్ల రాజు , అవదుర్తి శ్రీనివాస్, కార్పొరేటర్ కొమురయ్య , నాయకులు పెద్దపల్లి జితేందర్, గుంజేటి శివ , సుధాకర్ పటేల్ , వెంకటేష్ మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ లు ఫీజు రియంబర్స్మెంట్ వైఖరి పట్ల రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని తప్పు పట్టారు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా తక్షణమే రూ.12 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి,కన్నా కృష్ణ ,సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు ,జిల్లా కార్యదర్శి సిహెచ్ నరసింహరాజు, చేపూరీ సత్యం మీడియా కన్వీనర్ కటకం లోకేష్ మండల అధ్యక్షులు మడిశెట్టి సంతోష్, కంది రాజిరెడ్డి ,చింతం శ్రీనివాస్ ,తనకు సాయికృష్ణ, పాదం శివరాజ్, కార్పొరేటర్ లు బండ రమణ రెడ్డి, దేశీ శిల్పా పెద్దపల్లి శ్రీలేఖ ,తాటి ప్రభావతి మాసం గణేష్ ,భూపతి రవీందర్, తోట అనిల్. టీంకు, ఒంటెల సత్యనారాయణ రెడ్డి ,మహిళా మోర్చఅధ్యక్షులు గుర్రాల నిర్మల రెడ్డి , ఎస్టి మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మోతే గంగారెడ్డి , వెంకట్ రెడ్డి , ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆడి చెర్ల రాజు రమేష్ దూలం కిరణ్, ఆవుల తిరుపతి ,రవి ప్రసాద్ గుర్రం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా నుంచి వచ్చి గోదానం చేసిన దంపతులు

- శ్రావణమాసంలో ఆధ్యాత్మిక సేవలు...

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**



శ్రావణమాసం సందర్భంగా అమెరికా నుంచి స్వదేశానికి వచ్చిన సంగారెడ్డి జిల్లా ఝరాసం గం మండలం మాచునూర్ గ్రామానికి చెందిన కొంక వైజయంతిమాల, రమేష్ దంపతులు సోమవారం బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు గోవులను దానం చేయడంతో పాటు వేద విద్యార్థులకు అన్నదానం, భక్తులకు వస్త్రదానం నిర్వహించారు.ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ దంపతులను ప్రత్యేకంగా అభినందించి పూలమాలలతో సన్మానించారు. అమెరికాలోని మేరీల్యాం డ్‌లో స్థిరపడిన ఈ దంపతులు శ్రావణమాసంలో స్వదేశానికి వచ్చి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పీఠాధిపతులు పేర్కొన్నారు.కాగా, శ్రావ ణ సోమవారం సందర్భంగా ఆశ్రమంలో జ్యోతిర్లింగాలకు బిల్వార్చన, రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతులు నిర్వహించారు. రాత్రి బసవ పురాణ ప్రవచనం, భజన సంకీర్తన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.

# కోహీర్‌లో లీగల్ సర్వీసెస్ సెంటర్ ప్రారంభం

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహీర్ మున్సిపల్ పట్టణంలో ఎం.ఎఫ్. డాక్యుమెంట్ రైటర్స్ అండ్ లీగల్ సర్వీసెస్ సెంటర్‌ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రం యజమాని ముజామిల్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డా. సిద్ధం ఉజ్వల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన డాక్యుమెంట్ రైటింగ్‌తో పాటు న్యాయపరమైన సేవలను ఒకే చోట అందించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు సులభంగా, పారదర్శకంగా సేవలు అందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రం ఉపయోగపడాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రాంలింగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్, సీడీసీ చైర్మన్ ముబీన్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు, డాక్యుమెంట్ రైటర్లు, న్యాయ సేవల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం పదవులు ఇవ్వాలి

- ఓట్లు బీసీలవి ?? పదవులేమో ఒకే సామాజిక వర్గానిక ??
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**



త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా ఏమాత్రం ప్రాధాన్యత,పదవులు లేవని అన్ని పదవులు కూడా ఒకే సామాజిక వర్గానికి చెందినవారు అనుభవిస్తున్నారని బీసీలు కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పేరుకే సామాజిక న్యాయం అని చెప్తూ పదవులు ఇచ్చే కాడ మాత్రం ఒకే సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. ఒకపక్క బీసీలను పార్టీలో నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు.

# బిజెపి పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

- ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**వెలుతురు నారాయణఖేడ్ ఆగస్టు 24 :**





మెదక్ జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్.. గ్రామీణ ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీ పటిష్టత కోసం జిల్లా ఓబీసీ నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి. సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి లు పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షుడు గుణ విట్టల్ ఆధ్వర్యంలో నూతన ఓ బి సి జిల్లా బాధ్యులు ఎమ్మెల్సీ అంజిరెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఓబీసీ జిల్లా నూతన కార్యవర్గాన్ని వారు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఓబీసీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని సూచించారు.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ బాధ్యులు అశోక్. సగనాకర్. శ్రీనివాస్ మల్లేశం అంబదాస్ శ్రీనాథ్ పండరి రాములు పాల్గొన్నారు..

## ముసాయిదా ఓటర్ల జాబితాలో

# చేర్చబడిన ఓటర్ల పేర్లను కూడా సభలో చదివి వినిపించాలి

- సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

సోమవారం రోజున (24.08.2026) శ్రీ సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి, డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ముఖ్య ఎన్నికల అధికారి , శ్రీ జి.ఎస్. చారి, డిప్యూటీ సీఈఓ, కమిషనర్, GHMC & జిల్లా ఎన్నికల అధికారి, హైదరాబాద్, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు (DEOs), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (EROs) మరియు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (AEROs)తో రాష్ట్రంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో గ్రామ/వార్డు సభల నిర్వహణ మరియు సంబంధిత ఎలక్టోరల్ రోల్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో CEO గారు DEOs, EROs మరియు AEROsకు గ్రామ/వార్డు సభల ఏర్పాటు, నిర్వహణలో పాటించాల్సిన విషయాలు అలాగే Anomalies మరియు Logical Discrepancies ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ మరియు హియరింగ్‌ల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

**CEO గారు ఇచ్చిన ముఖ్య సూచనలు:**

గ్రామ/వార్డు సభల్లో Absent, Shifted, Dead మరియు Duplicate (ASDD) ఓటర్ల వివరాలను సంబంధిత BLOలు బహిరంగంగా చదివి వినిపించాలి. అలాగే, ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చబడిన ఓటర్ల పేర్లను కూడా సభలో చదివి వినిపించాలి.ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఏదైనా కారణంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చబడని దరఖాస్తుదారుల వివరాలను గుర్తించి, వాటిని పరిశీలించాలి.01.10.2026 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి చేసే అర్హత కలిగిన భారతీయ పౌరులు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేందుకు Form-6, Declaration Form మరియు అవసరమైన ఆధార పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలి. ఓటర్ల పేర్ల తొలగింపులకు Form-7, సవరణలకు Form-8 మరియు సంబంధిత ఆధార పత్రాలను సమర్పించే విధంగా ప్రజలకు సూచించాలి.Claims, Objections , Verificationకు నిర్దేశించిన కాలంలో, భారత ఎన్నికల సంఘం (ECI) నిర్దేశించిన అవసరమైన పత్రాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామ/వార్డు సభల్లో చర్చలు నిర్వహించాలి.ఓటర్ల జాబితా మరియు SIR కు సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలను కూడా గ్రామ/వార్డు సభల్లో చర్చించాలి.

**వాటిని BLO లు నోట్ చేసుకోవాలి.**

No-Mapping Cases మరియు Anomalies ఉన్న ఓటర్లకు నోటీసుల జనరేషన్ మరియు జారి ప్రక్రియను వేగవంతం చేయాలి. ప్రతి నోటీసులో Hearing Venue, Date మరియు Time వివరాలను స్పష్టంగా, తప్పనిసరిగా పేర్కొనాలి.Anomalies మరియు No Mapping సంబంధించిన జాబితాలను BLOలు సంబంధిత రాజకీయ పార్టీలకు షేర్ చేయాలి.రాజకీయ పార్టీలతో సమన్వయం కోసం Political Party Meetingsను ప్రతి వారం తప్పనిసరిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.




అనంతరం CEO గారు అన్ని జిల్లాల DEOలతో నోటీసుల జనరేషన్, జారి ప్రక్రియ, హియరింగ్‌ల నిర్వహణ , గ్రామ/వార్డు సభల ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్ష చేశారు.గ్రామ/వార్డు సభలను పారదర్శకంగా మరియు సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ఓటర్లలో విశ్వాసాన్ని పెంపొందించి, ఎన్నికల ప్రక్రియపై మరింత విశ్వసనీయతను తీసుకురావాలని CEO గారు సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నోడల్ అధికారులు మరియు PM (IT) పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో 250 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

హుస్నాబాద్ పట్టణంలో నిర్మితమవుతున్న 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, పనుల నాణ్యత, వేగం, నిర్మాణ ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఆసుపత్రి నిర్మాణ పనులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న 250 పడకల ఆసుపత్రి భవనం పూర్తయితే ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయాలు మరింత చేరువ కానున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిర్మాణ పనుల సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేసిన మంత్రి, ఆసుపత్రి భవన నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.



# ఇందిరా పార్క్ వద్ద ఆగస్టు 27న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలి

- TGEJAC హైదరాబాద్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఎస్ .విక్రమ్ కుమార్ కన్వీనర్ ఎంబి .క్రిష్ణ యాదవ్ .

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

TGEJAC హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఎస్ విక్రమ్ కుమార్ మరియు ఎం బి కృష్ణ యాదవ్ నేతృత్వం లో కార్యవర్గ సమావేశం సోమవారం రోజున హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కలెక్టర్ లో పలు కీలక అంశాలను చర్చించి, క్రింది కార్యక్రమాలు ఏకగ్రీవంగా నిర్ణయించింది:

TGEJAC తీసుకున్న నిర్ణయాలు, PRC ని వెంటనే ప్రకటించాలి, DA లను వెంటనే ప్రకటించి పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలి, OPS ను పునరుద్దరించాలి, EHS ను సమర్థవంతం గా అమలు చేయాలని కోరుతూ తీసుకున్న నిర్ణయాలకు మద్దతు ప్రకటించి ఈ క్రింది కార్యక్రమాలను విజయవంతం చేయాలనీ కోరారు.

- **27 ఆగస్టు 2026: ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా/ప్రదర్శన.**
- **10 సెప్టెంబర్ 2026: చలో హైదరాబాద్ కార్యక్రమం.**

ఈ కార్యక్రమాలకు Hyderabad జిల్లా నుండి ప్రతి ఒక్కరూ సంపూర్ణ సహకారం అందిస్తూ, అధిక సంఖ్యలో పాల్గొనాలని సభ్యులను కోరారు.ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా



అదనపు కలెక్టర్ (రెవెన్యూ విభాగం) శ్రీ కదరావన్ పలని ఐఏఎస్. గారు కలిసి, హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ఈనెల 27వ తారీకున మహా ధర్నా కార్యక్రమానికి సంబంధించి సమాచార పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ ఆశన్న. ఎన్జీవో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కే . శ్రీనివాస్. నాలుగో తరగతి అధ్యక్షుడు సత్యనారాయణ. మంజుల రెడ్డి. కో కన్వీనర్ నర్సింగ్ రావు. జాకబ్. డాక్టర్ సురేందర్. బాలాజీ. రాజ్ కుమార్.వెంకటేష్. తదితరులు పాల్గొని ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం మరియు వారి న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం మనమందరం ఐక్యంగా, సమష్టిగా పనిచేద్దాం అని పేర్కొన్నారు.

**ఎస్ .విక్రమ్ కుమార్ మరియు ఎం.బి.కృష్ణ యాదవ్.TGEJAC హైదరాబాద్ జిల్లా**



# హిమాయత్ నగర్ డివిజన్ అవంతి నగర్, రెడ్డి కాలనీలలో మున్సిపల్ అధికారులతో కాంగ్రెస్ నాయకుల పర్యటన

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:**

హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆదేశాల మేరకు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్ మున్సిపల్ ఏఈ చరణ్‌తో కలిసి డివిజన్‌లోని అవంతి నగర్ మరియు రెడ్డి కాలనీ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. అవంతి నగర్ ప్రాంతంలో బోనాల పండుగ ఉండటం వల్ల నూతన సీసీ రోడ్డు వేయడం ఆలస్యమైందని, ప్రస్తుతం బోనాలు ముగియడంతో మరో రెండు రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభమవుతాయని ఏఈ చరణ్ తెలిపారు.రెడ్డి కాలనీలో వేసిన రోడ్డు కింద ఉన్న వర్షపు నీరు వెళ్లే పైపు స్లోప్ సరిగ్గా లేకపోవడంతో, వర్షపు నీరు రోడ్డు వైపు వెళ్లకుండా తిరిగి బస్తీలోకి వస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు నాయకుల దృష్టికి వచ్చింది. ఈ సమస్య పూర్తిగా కాంట్రాక్టర్ తప్పు వల్లనే జరిగిందని గుర్తించిన నాయకులు, తక్షణమే ఆ లోపాన్ని సరిదిద్దాలని ఆదేశించారు. ఒకవేళ సరిచేయని పక్షం లో కాంట్రాక్టర్ బిల్లును ఆపేయాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఈ పర్యటనలో బస్సు శ్రీనివాసులు, అరుణ్ రెడ్డి, రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# చౌటుప్పల్ హైవే బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి




**చౌటుప్పల్ వెలుతురు ఆగస్టు 24:**

చౌటుప్పల్ పట్టణ పరిధిలో కొనసాగుతున్న జాతీయ రహదారి బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులను అధికారులు వేగవంతం చేసి, ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు చౌటుప్పల్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, వలిగొండ, మునుగోడు, నారాయణపూర్, ధర్మోజిగూడెం, గుజ్జ తదితర ప్రాంతాల నుంచి చౌటుప్పల్‌కు వచ్చే ప్రజలు కూడా ఇదే మార్గాన్ని వినియోగిస్తున్నారని సుర్వి యాదయ్య గౌడ్ తెలిపారు. బ్రిడ్జి, రోడ్డు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా పెరిగి ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోందని, నిర్మాణ ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ ప్రాంతంలో సరైన బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, రాత్రివేళల్లో లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.బ్రిడ్జి నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, సంబంధిత ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో చేపట్టాలని సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం, నాణ్యత లోపాలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు.రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చౌటుప్పల్‌లో జరుగుతున్న బ్రిడ్జి, రోడ్డు పనులను పరిశీలించేందుకు ఇప్పటివరకు రాకపోవడం దురదృష్టకరమని సుర్వి యాదయ్య గౌడ్ విమర్శించారు. అలాగే భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఢిల్లీకే పరిమితమయ్యారని



ఆరోపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించి పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటు, పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్‌ను సక్రమంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చౌటుప్పల్ ఆర్డీఓకు అందజేసిన వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్, ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, మునుగోడు బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షులు నల్పరాజు రమేష్, మండల నాయకులు బోయ శ్రీరాములు, ధర్మోజిగూడెం గ్రామ అధ్యక్షులు బత్తుల సింహాద్రి, నారాయణపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ భిక్షం, గుజ్జ గ్రామ శాఖ అధ్యక్షులు సత్తయ్య, నాయకులు పొట్ట జంగయ్య, సుర్వి లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో ఎన్ఈహెచ్ఎస్ ఆసుపత్రులపై డా. కె. ఆనంద్ తనిఖీలు

- **ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై సమగ్ర పరిశీలన**

**మేడ్చల్ జిల్లా వెలుతురు ఆగస్టు 24:**

మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎన్ఈహెచ్ఎస్) కింద ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, చికిత్సా విధానాలు మరియు ఇతర ఏర్పాట్లను పరిశీలించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కె. ఆనంద్ పలు ఆసుపత్రులను సందర్శించి తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా రెమిడీ ఆసుపత్రి, ఓమి ఆసుపత్రి, నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి, మెడిసిటీ ఆసుపత్రి, ఓజోన్ ఆసుపత్రిలను సందర్శించి, నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని సౌకర్యాలు, రోగుల రిజిస్ట్రేషన్లు, చికిత్సా వివరాలు, రికార్డులు మరియు ఇతర సంబంధిత అంశాలను పరిశీలించారు.





# వేముల వీరేశం చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- **రామన్నపేట ఎమ్మార్వో లాల్ బహదూర్ శాస్త్రి**

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 24:**

శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ వేముల వీరేశం చేతుల మీదుగా రామన్నపేట మండలం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ రేపు మంగళవారం 25.8.2026 నాడు మధ్యాహ్నం 3.00 గంటలకు జిఆర్ఎం ఫంక్షన్ హాల్ , రామన్నపేట గ్రామపంచాయతీ పక్కన ( శివాలయం వీధి ) జరుగును. కావున దయచేసి ఈ కార్యక్రమమునకు ఆహ్వానించడమైనది .

## ఖమ్మం వైద్యరంగంలో నవశకం...

# 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభానికి సిద్ధం..

- **మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభోత్సవం**
- **రూ.23.75 కోట్లతో అత్యాధునిక భవనాలు మరియు సదుపాయాల కల్పన**
- **కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యం**
- **తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారికి అత్యాధునిక క్రిటికల్ కేర్ సేవలు**
- **హైదరాబాద్‌కు తరలింపు అవసరం తగ్గే అవకాశం**
- **మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో సాకారమైన కీలక ప్రాజెక్టు**

**ఖమ్మం వెలుతురు ఆగస్టు 24:**

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజారోగ్య చరిత్రలో మరో కీలక అధ్యాయానికి నాంది పలికేందుకు ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిద్ధమైంది. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రి గడప తొక్కే రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన అత్యాధునిక 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. తీవ్రమైన అనారోగ్యంతో, ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరుకునే రోగులకు సత్వరమే అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ఈ సదుపాయం ఎంతో దోహదపడునుంది. ఇది కేవలం ఒక భవన ప్రారంభోత్సవం కాదు... ఖమ్మం జిల్లా ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం వేసిన మరో దృఢమైన అడుగుగా వైద్య వర్గాలు అభివర్ణిస్తున్నాయి. సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల వేసిన అడుగులు కృషి నేడు ఫలించింది.

### రూ.23.75 కోట్లతో రూపుదిద్దుకున్న అధునాతన నిర్మాణం...

ఈ క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.23.75 కోట్ల భారీ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2023 జూన్ 7న జారీ అయిన జీవో ఆర్‌టీ నంబర్ 311 ద్వారా ఈ అనుమతులు లభించడంతో నిర్మాణ పనులకు వేగం పెరిగింది. రూ.12.66 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ ప్రక్రియ చేపట్టగా, 2.79 శాతం తక్కువ ధరకే కాంట్రాక్టు ఖరారు కావడం విశేషం. ఇప్పటివరకు నిర్మాణానికి సుమారు రూ.15.27 కోట్లు వెచ్చించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

### వైద్య పరికరాలకు రూ.8.48 కోట్లు కేటాయింపు..

మంజూరైన మొత్తం నిధుల్లో నిర్మాణ వ్యయం పోను మిగిలిన రూ.8.48 కోట్లను అత్యాధునిక వైద్య పరికరాల సమకూర్పుకు వినియోగించనున్నారు. దీనితో కేవలం భవనం మాత్రమే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సాంకేతిక సదుపాయాలు కూడా అందుబాటులోకి రానున్నాయి. ఫలితంగా క్రిటికల్ కేర్ చికిత్సలో నాణ్యత మరింత మెరుగుపడనుంది.

### నాలుగంతస్తుల్లో సమగ్ర వైద్య సదుపాయాలు..

నాలుగు అంతస్తుల్లో విశాలంగా నిర్మించిన ఈ క్రిటికల్ కేర్ బ్లాక్‌లో రోగుల అవసరాలకు అనుగుణంగా వివిధ విభాగాలను ఏర్పాటు చేశారు.

- **రెండు ఐసీయూ విభాగాల్లో 20 పడకల చొప్పున 40 పడకలు**
- **20 పడకల జనరల్ వార్డు**
- **5 పడకల డయాలసిస్ వార్డు**

గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, తీవ్ర శ్వాసకోశ సమస్యలు, మూత్రపిండాల వైఫల్యం తదితర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు అవసరమైన క్రిటికల్ కేర్ సేవలను ఒకే చోట అందించే అవకాశం ఏర్పడనుంది.

### హైదరాబాద్‌కు తరలింపు అవసరం తగ్గే అవకాశం..

ఇప్పటివరకు తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న



రోగులను మెరుగైన క్రిటికల్ కేర్ కోసం హైదరాబాద్ వంటి నగరాలకు తరలించాల్సిన పరిస్థితి ఉండేది. ఈ క్రమంలో ప్రయాణ సమయం కీలకంగా మారేది. తాజాగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనే అత్యాధునిక క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి రానుండటంతో అత్యవసర సమయంలో విలువైన సమయం ఆదా కావడంతో పాటు రోగుల ప్రాణాలను కాపాడే అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఖమ్మం జిల్లావాసులతో పాటు చుట్టుపక్కల మండలాలు, పొరుగు జిల్లాల ప్రజలు కూడా ఈ సదుపాయం ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

### ప్రభుత్వ వైద్యానికి మరింత బలం..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఖమ్మం



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ అందుబాటులోకి రానుండటం జిల్లా వైద్య రంగానికి ఒక కీలక ముందడుగుగా నిలవనుంది.

### నేడు మంత్రి తుమ్మల చేతుల మీదుగా ప్రారంభం..

సుదీర్ఘ నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసుకున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా నేడు లాంఛనంగా ప్రారంభం కానున్న ఈ అత్యాధునిక వైద్య సదుపాయం ఖమ్మం ప్రభుత్వ వైద్య సేవల చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించనుంది.

# అర్హులందరికీ చేయూత పింఛన్లు

- చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి చేస్తా..
- గతంలో సేకరించిన భూములపై చర్చించి నిర్ణయం
- ఆయిల్‌ఫామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి..
- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఓగులాపూర్ గ్రామంలో సోమవారం 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం

**చిగురుమామిడి వెలుతురు ఆగస్టు 24:**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేయూత అందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి చేస్తామని, గతంలో తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం సేకరించిన భూముల అంశంపై రైతులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఓగులాపూర్ గ్రామంలో సోమవారం 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణం పేరుతో సేకరించిన భూములకు సంబంధించిన అంశాన్ని రైతులతో కలిసి చర్చించి పరిష్కార దిశగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ముంపునకు గురైన భూముల్లో పండించిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బోదకాలు బాధితులు సహా పింఛన్లకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇల్లు లేని అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఓగులాపూర్‌లో ప్రగతి నివేదిక..

ఓగులాపూర్ గ్రామంలో ఇప్పటికే 8 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయి. మహాలక్ష్మి పథకం కింద 225 మంది లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ అందుతోంది. 311 మందికి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. గృహజ్యోతి పథకం కింద 283 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది. ఇందుకోసం ప్రతి నెల సుమారు రూ.13.34 లక్షల ప్రయోజనం లబ్ధిదారులకు కలుగుతోంది.రైతు భరోసా కింద 100 మంది రైతులకు రూ.9.67 లక్షలు విడుదల కాగా, రైతు రుణమాఫీ కింద 53 మంది రైతులకు రూ.42.54 లక్షల ప్రయోజనం కలిగింది. గ్రామంలో 183 మంది పింఛన్లు పొందుతున్నారు. మొత్తం 485 రేషన్ కార్డులు ఉండగా, ప్రజా ప్రభుత్వంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. కొత్తగా 57 రేషన్ కార్డులు మంజూరు కాగా, మరో 136 మంది పేర్లు రేషన్ కార్డుల్లో నమోదు చేసుకున్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 17 మంది లబ్ధిదారులకు రూ.17 లక్షలకు పైగా ఆర్థిక సాయం అందించారు. అర్హులైన వారికి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

### ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి

రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. దీర్ఘకాలికంగా రైతులకు ఆదాయం అందించే పంటల వైపు మళ్లాలని, ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ అవసరాల మేరకు చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమం అనంతరం గ్రామైక్య సంఘం భవనంలో మంత్రి మొక్కలు నాటారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను పంపిణీ చేశారు.

**గుణుకులపల్లి లో సబ్ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేస్తా..**

- అంగన్వాడి సెంటర్ ను మంజూరు చేయిస్తా..
- గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తా..
- ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి

**రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

గునుకులపల్లిలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవాలని, రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ కొద్ది రోజుల క్రితం కొండగట్టు అంజన్న స్వామి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ చేసినట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం గునుకులపల్లిలో సోమవారం సాయంత్రం 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ప్రజా సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దేశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఏడాది వరకు వర్షాలు తగ్గే అవకాశం



ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని నువ్వులు, ఆముదాలు, మొక్కజొన్న, వేరుశనగ, ఆయిల్‌ఫామ్ వంటి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

### గునుకులపల్లిలో సబ్ మార్కెట్ యార్డు

గునుకులపల్లి గ్రామంలో సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయిస్తానని తెలిపారు. గ్రామస్తులు అందరూ కలిసి కట్టుగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వివో బిల్డింగ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

### గునుకులపల్లి ప్రగతి నివేదిక..

గ్రామంలో 36 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయి. మహాలక్ష్మి పథకం కింద 130 మందికి గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి పథకం కింద 133 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది. గునుకులపల్లిలో 330 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.1.86 కోట్లు విడుదలయ్యాయి. రైతు రుణమాఫీ కింద 101 మంది రైతులకు రూ.91.41 లక్షలు ప్రయోజనం కలిగింది. సన్న రకం ధాన్యం పండించిన ఏడుగురు రైతులకు రూ.91 వేల ప్రోత్సాహకం అందించారు. గ్రామంలో 85 మంది పింఛన్లు పొందుతున్నారు. మొత్తం 233 రేషన్ కార్డులు ఉన్నాయి.. కొత్తగా 35 రేషన్ కార్డులు మంజూరు కాగా, మరో 30 మంది పేర్లు రేషన్ కార్డుల్లో నమోదు చేసారు. అర్హులైన వారికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

### ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లతో భూగర్భ జలాల పెంపు

ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, రైతులు తమ పొలాల్లో ఫామ్ పాండ్లు నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని, బావులు, బోర్లు ఎండిపోకుండా నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు.

### సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

గ్రామస్తులంతా కలిసికట్టుగా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీవో షర్మిల డిపిఓ జగదీశ్వర్ హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి తహసిల్దార్ కనకయ్య ఎంపీడీవో రామ్మోహన చారి గ్రామ సర్పంచ్ గునుకుల మధుసూదన్ రెడ్డి వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపుతో ఆయిల్ ఫామ్ సాగుకు పెద్ద ఎత్తున ముందుకొచ్చిన రైతులు..

- ఎకరాకు లక్షన్నర ఆదాయం
- 100 ఎకరాల్లో సాగుకు రైతుల ఆసక్తి..
- పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ సాగు చేపట్టే గ్రామాలకు ప్రత్యేక నిధులు..
- సోలార్ విద్యుత్‌తో ఆదా..
- సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి..
- మంత్రి పొన్నం ప్రభాకర్

**ఇందుర్తి వెలుతురు ఆగస్టు 24:**

చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం

చిగురుమామిడి: ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులు అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని, ఇందుర్తి గ్రామ రైతులు పెద్ద ఎత్తున ఆయిల్‌ఫామ్ సాగువైపు అడుగులు వేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. మంత్రి పిలుపుతో ఇందుర్తి గ్రామానికి చెందిన రైతులు సానుకూలంగా స్పందించి దాదాపు 100 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టేందుకు ముందుకొచ్చారు. రైతులను మంత్రి అభినందించారు.

### చిగురుమామిడి మండలం ఇందుర్తి

గ్రామంలో సోమవారం 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయిల్‌ఫామ్‌తో పాటు నువ్వులు, వేరుశనగ, ఆముదం తదితర పంటల సాగుపై కూడా రైతులు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. వ్యవసాయంలో వైవిధ్యాన్ని పెంచుకుని అధిక ఆదాయం సాధించే దిశగా రైతులు ముందుకు సాగాలని కోరారు.

### ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలి

గ్రామంలోని ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునేలా ప్రజలు ముందుకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సోలార్ విద్యుత్‌ను వినియోగించుకో వడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు ప్రభుత్వం అందించే సబ్సిడీని కూడా సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. రైతులు, గ్రామ ప్రజలు సోలార్ విద్యుత్ ఏర్పాటుపై దృష్టి సారించి పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకో వాలని పిలుపునిచ్చారు.

### ఇందుర్తి అభివృద్ధే లక్ష్యం

ఇందుర్తి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు 'పల్లె పల్లెకు పొన్నం అన్న' కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మంత్రి సూచించారు. వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ప్రజలు అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు.

గ్రామస్తులు వ్యక్తిగత సమస్యలతో పాటు సామాజిక సమస్యలపై మంత్రికి పెద్ద ఎత్తున సమర్పించారు.

### ఇందుర్తి గ్రామ ప్రగతి నివేదిక

- గ్రామంలో 32 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయి.
- మహాలక్ష్మి పథకం కింద 673 మంది లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ అందుతోంది.
- 91 స్వశక్తి సంఘాల మహిళలకు రూ.32.61 లక్షల వడ్డీలేని రుణాలు అందించారు.
- శ్రీనిధి కింద 11 సంఘాలకు రూ.40 లక్షలు అందించారు.
- 1,431 మందికి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.
- గృహజ్యోతి పథకం కింద 793 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది.
- 1,249 మంది రైతులకు రైతుభరోసా కింద రూ.8.06 కోట్లు విడుదలయ్యాయి.
- 532 మంది రైతులకు రైతు రుణమాఫీ కింద రూ.4.38 కోట్ల ప్రయోజనం కలిగింది.



- ఆరుగురికి రైతుబీమా కింద రూ.30 లక్షలు అందించారు.
- గ్రామంలో 862 పింఛన్లు ఉండగా, ప్రతి నెల రూ.19.61 లక్షలు పంపిణీ చేస్తున్నారు.
- గ్రామంలో 1,126 రేషన్ కార్డులు ఉండగా, ప్రజా ప్రభుత్వంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు.
- కొత్తగా 175 రేషన్ కార్డులు మంజూరు చేశారు.
- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద 66 మంది లబ్ధిదారులకు రూ.66.06 లక్షలు అందించారు.

- అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.



చిగురు మామిడి మండలం నవాబ్ పేట లో పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ .. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రాగానే పార్టీలో లొల్లులు ఎక్కువయ్యాయని, తన ఉనికి కాపాడుకోవడానికే రాంచందర్ రావు ఈ ఫీజు రీయింబర్స్ మెంట్ దీక్షల డ్రామాలు ఆడుతున్నారు.. చేతనైతే ఢిల్లీ నుంచి పైసలు తీసుకురావాలి.... నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీకి పోయి కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు తీసుకురావాలని సవాల్..

### పాత బాపతు బకాయిలు క్లియర్ చేస్తున్నం

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఫీజు బకాయిలు పెండింగ్ పెట్టినప్పుడు కిమ్మనకుండా కూర్చున్న బీజేపీ నేతలు, ఇప్పుడు ప్రజా ప్రభుత్వంపై గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు.

### అడ్వాన్స్ పేమెంట్లు - గ్రీన్ ఛానల్ ద్వారా పేమెంటు చేస్తున్నాం...

ఈ విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్యాంకుల ద్వారా అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లిస్తున్నామని, సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు ఇస్తున్నాం.. దేశంలో బీజేపీ అధికారంలో ఉన్న ఏ ఒక్క రాష్ట్రంలోనైనా ఫీజు రీయింబర్స్ మెంట్ ఇస్తున్నారా? కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా తెచ్చారా? సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ హాస్టళ్ల నిర్మాణం చేపడుతూ, అధికారంలోకి రాగానే మెస్ చార్జీలు పెంచి విద్యార్థుల కడుపు నింపుతున్నాం.. మొసలి కన్నీళ్లు ఆపి, ఢిల్లీ పెద్దలకు జ్ఞానోదయం చేసి బీజేపీ రాష్ట్రాల్లో కూడా ఈ పథకం అమలు చేయించాలని, అభివృద్ధి పథంలో సాగుతున్న సర్కారుపై అనవసరంగా అడ్డం పడద్దు.

# కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తుల పరిశీలన

- నేడే సాయంత్రం (25 వ తేదీ) ఆన్ లైన్ లో అన్ని వివరాలు

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 24:**

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన కొనసాగుతున్నదనీ, అందులో ప్రాథమికంగా అనర్హులుగా గుర్తించిన వారి నుంచి వచ్చిన అభ్యంతరాలను కూడా పరిశీలిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ శ్రీ విపి గౌతం తెలిపారు. ఈ ప్రక్రియ మంగళవారం సాయంత్రం వరకు కొనసాగుతుందనీ, ముందు ప్రకటించిన విధంగా 25 వ తేదీ సాయంత్రం వరకు అన్ని వివరాలు ఆన్ లైన్ లో వెల్లడిస్తామని పేర్కొన్నారు. అవుటర్ రింగ్ రోడ్ లోపలి వైపు ఉన్న 16 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజల నుంచి ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతాల్లోని ఇండ్ల కోసం 60,720 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమిక పరిశీలన అనంతరం అనర్హులుగా గుర్తించిన వారందరికి సమాచారం పంపించామని, 24వ తేదీ సాయంత్రం వరకు వారి నుంచి అభ్యంతరాలను స్వీకరించామన్నారు. ప్రధానంగా నగరంలో స్థిర నివాసం ఉండకపోవడం, ఇప్పటికే ఇండ్లు లేదా ఫ్లాట్ కలిగి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. దరఖాస్తుదారుల్లో ఫోర్ వీలర్స్ ఉండి వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్న వారిని అనర్హులుగా పరిగణించామని, క్యాబ్ లుగా వినియోగిస్తున్న దరఖాస్తు దారులను అర్హులుగా గుర్తిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనర్హులుగా గుర్తించిన వారి నుంచి వచ్చిన అభ్యంతరాలన్నిటినీ కూడా పరిశీలిస్తున్నామని, వాటన్నిటిని పరిష్కరించిన తరువాత అర్హులైన వారి తుది జాబితాను ప్రకటిస్తామని వెల్లడించారు.

ఈ దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి అపోహలకు, అనుమానాలకు లోను కావద్దనీ ఆయన సూచించారు. దరఖాస్తు స్థితిగతులను తెలుసుకోడానికి ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగవద్దనీ, అన్ని వివరాలను tghb.telangana.gov.in వెబ్ సైట్ లో అందుబాటులో తెస్తామని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు దారులకు ఏమైనా సందేహాలుంటే, కాల్ సెంటర్ నెంబరు 04024603572 లో సంప్రదించాలని సూచించారు.

# గౌరవెల్లి పూర్తి చేసి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేస్త



- భూసేకరణ వేగవంతం..
- రూ.250 కోట్ల నిధులు మంజూరు..
- కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలి..
- ఆయిల్ ఫామ్ సాగుతో
- అత్యధిక లాభాలు..
- రైతులు ఈ పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలి..
- ఇంటింటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలి..
- వర్షపు నీటిని ఒడిసిపట్టడమే ప్రధాన లక్ష్యం..
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమం మంత్రి పొన్నం ప్రభాకర్
- కొండాపూర్ గ్రామంలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం..

**చిగురుమామిడి వెలుతురు ఆగస్టు 24:** అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, ఇందుకోసం ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. మూడు జిల్లాల కలెక్టర్లు భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు.చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో సోమవారం 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వల నిర్మాణానికి సంబంధించి రైతులు సహకరించాలని మంత్రి కోరారు. భూసేకరణ ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేలా అందరూ సహకరిస్తే, భూములు సేకరించిన వెంటనే అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు..

### గ్రామాభివృద్ధి నిరంతర ప్రక్రియ

గ్రామాల అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగుతూనే ఉంటాయని మంత్రి అన్నారు. కొండాపూర్ గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులంతా ఐక్యంగా ముందుకు సాగుతూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.గ్రామంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు మంత్రి దృష్టికి తీసుకురావడంతో దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు వైద్య సేవలు, అంగన్వాడీ కేంద్రాల సేవలను ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

### ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. గ్రామంలో ఆయిల్‌ఫామ్ సాగును విస్తృతంగా చేపట్టి రైతులు అధిక లాభాలు పొందేలా ప్రోత్సహించాలని అన్నారు. ఆయిల్‌ఫామ్ సాగుతో ఎకరానికి సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా ఒడిసిపట్టేందుకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొండాపూర్ గ్రామంలో ఇప్పటికే 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయని అధికారులు వివరించారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా గుడిసెల్లో నివసిస్తున్న ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు.గ్రామంలో గుడాల భాగ్య అనే లబ్ధిదారు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని మంత్రి ప్రారంభించారు. అనంతరం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘాల భవనానికి శంకుస్థాపన చేశారు. పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాన్ని కూడా ప్రారంభించారు. కొండాపూర్‌కు అందుతున్న సంక్షేమ ఫలాలు కొండాపూర్ గ్రామ ప్రగతి నివేదికను అధికారులు మంత్రి సమక్షంలో వెల్లడించారు. ప్రజా పాలన ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలకు అందుతున్న ప్రయోజనాల వివరాలను తెలిపారు.

- మహాలక్ష్మి పథకం కింద 522 మంది లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ అందుతోంది.
- 50 మంది స్వశక్తి మహిళలకు రూ.19.84 లక్షల వడ్డీలేని రుణాలు అందించారు.
- శ్రీనిధి కింద మహిళా సంఘాలకు రూ.3.31 కోట్లు అందించారు.
- 551 మందికి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.
- గృహజ్యోతి పథకం కింద 462 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది.
- 573 మంది రైతులకు రైతుభరోసా కింద రూ.2.30 కోట్లు విడుదలయ్యాయి.
- 284 మంది రైతులకు రైతు రుణమాఫీ కింద రూ.2.03 కోట్ల ప్రయోజనం కలిగింది.
- రైతుబీమా కింద ముగ్గురికి కలిపి రూ.15 లక్షలు అందించారు.
- గ్రామంలో 362 పింఛన్లు ఉండగా, ప్రతి నెల రూ.8.27 లక్షలు పంపిణీ చేస్తున్నారు.
- గ్రామంలో 886 రేషన్ కార్డులు ఉండగా, సన్నబియ్యం పంపిణీ కొనసాగుతోంది.
- కొత్తగా 119 రేషన్ కార్డులు మంజూరు చేశారు.
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద 40 మంది లబ్ధిదారులకు రూ.40.04 లక్షలు అందించారు.
- అర్హులైన వారికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

### ప్రజల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం

గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే చర్యలు తీసుకోవడమే 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను మంత్రి స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో షర్మిల, డీపీవో జగదీశ్వర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ మర్క రాజ్‌కుమార్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రామ్మోహనాచారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- గుంతల నిర్మాణంలో నవాబుపేట నంబర్ వన్‌గా నిలవాలి
- కరెంటు సమస్యను వెంటనే పరిష్కరిస్తా..
- రైతులు ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలి..
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి..
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి మండలం నవాబుపేటలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న.. పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమం

చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గ్రామంలో పర్యటించిన మంత్రి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో సోమవారం 'పల్లె పల్లెకు పొన్నం అన్న–పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో నవాబుపేట గ్రామం రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేయ డం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని, ఇందుకు ప్రతి కుటుంబం బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### కరెంటు సమస్యపై తక్షణ స్పందన

గ్రామంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. గ్రామంలో విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

### ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక ఆదాయం

రైతులు సంప్రదాయ పంటలతో పాటు అధిక లాభాలు అందించే ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఆయిల్‌ఫామ్ సాగును పెద్ద ఎత్తున చేపట్టడం ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా మెరుగైన ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ, సంక్షేమ పథకాలను రైతులు, ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.

నవాబుపేట గ్రామంలో ప్రభుత్వ పథకాల ద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలు లబ్ధి పొందుతున్నారని మంత్రి తెలిపారు.

### నవాబుపేట ప్రగతి నివేదిక

గ్రామంలో 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయి. మహాలక్ష్మి పథకం కింద 629 మంది లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ అందుతోంది. గృహజ్యోతి పథకం ద్వారా 754 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతోంది. 1,143 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.6.90 కోట్లు విడుదల కాగా, 452 మంది రైతులకు రైతు రుణమాఫీ కింద రూ.4.09 కోట్ల ప్రయోజనం చేకూరింది. రైతు బీమా కింద 12 మందికి రూ.60 లక్షలు అందించారు. గ్రామంలో 519 మందికి ప్రతినెలా సామాజిక భద్రత పింఛన్లు అందుతున్నాయి. 1,273 రేషన్ కార్డులు ఉండగా, ప్రజా ప్రభుత్వంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. కొత్తగా 157 రేషన్ కార్డులు మంజూరు కాగా, 304 మంది పేర్లను రేషన్ కార్డుల్లో కొత్తగా నమోదు చేశారు. కళ్యాణలక్ష్మి పథకం కింద 42 మంది లబ్ధిదారులకు రూ.42 లక్షలకు పైగా ఆర్థిక సాయం అందించారు. మూడు సంఘాలకు స్టీల్ బ్యాంకులను అందించారు. అర్హులైన వారికి స్మార్ట్ రేషన్ కార్డులను కూడా పంపిణీ చేశారు.

### అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

నవాబుపేట గ్రామ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో షర్మిల, డీపీవో జగదీశ్వర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ గూళ్ల రజిత రాజు, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రామ్మోహనాచారి, శాఖల అధికారులు, ప్రజాప్రతిలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణిని కాపాడుకుంటూ.. లాభాల బాటలో నడిపిస్తాం



తెలంగాణ రాష్ట్రానికి ఆత్మ లాంటి అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు కూడా లాభదాయక సంస్థగా అందించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. సింగరేణి ఉజ్వల భవిష్యత్ కోసం దిశా నిర్దేశం చేస్తూ కంపెనీ మనుగడకు కీలకమైన బొగ్గు బ్లాకలు సాధించడంలో సంపూర్ణ సహకారం అందిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లుకు సింగరేణిలోని గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాక్‌లను తీసుకోకపోవడం, ఉన్న గనులను మూసివేయడం వల్ల సింగరేణికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఐదారు సంవత్సరాల్లో సంస్థ మూతపడే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులు గట్టి పట్టుదలతో నైని కోల్ బ్లాక్‌ను సాధించామని చెప్పారు. 2013లో యూపీఏ ప్రభుత్వం సింగరేణికి రీ–అసైన్ చేసిన తాడిచర్ల–2 కోల్ బ్లాక్ విషయాన్ని కేంద్రంతో మాట్లాడి మైనింగ్ లీజు దక్కించుకోవడంలో ప్రభుత్వం సఫలమైందని తెలిపారు. అంతేకాకుండా జెన్కోను ఒప్పించి, సింగరేణికి వేలంలో మణుగూరు డిప్ సైడ్ బ్లాక్ –2 దక్కేలా కృషి చేశామన్నారు. ఒడిశాలోని 'నైనీ' బ్లాక్ సమస్యల పరిష్కారానికి స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి మార్గం సుగమం చేశామని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి వస్తుండటంతో భవిష్యత్తులో థర్మల్ పవర్ డిమాండ్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం బొగ్గుపైనే ఆధారపడితే సింగరేణి కూడా ఒకప్పటి BSNL లా వెనుకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే ప్రపంచ మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి 'క్రిటికల్ మినరల్స్' (కీలక ఖనిజాలు) మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు సౌత్ ఆఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి భట్టిశాల కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించామని డిప్యూటీ సీఎం చెప్పారు. ఇప్పటికే కర్ణాటకలోని ఒక గోల్డ్ మైన్ వేలంలో పాల్గొని సాధించామని, ఆ గని ద్వారా భవిష్యత్ లో అక్కడ మైనింగ్ చేస్తే సింగరేణికి నిరంతరం రాయల్టీ లేదా ఆదాయం వస్తుందన్నారు. ప్రస్తుతం సింగరేణిలో 43,000 నుండి 45,000 మంది శాశ్వత ఉద్యోగులు, మరో 30,000 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా సరే మైనింగ్ బ్లాక్‌లను దక్కించుకునేలా ముందుకు వెళ్లాలన్నారు. 100 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న సింగరేణి సంస్థను అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ సంస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ సమష్టిగా పనిచేసి కంపెనీని ఉన్నతస్థాయిలో నిలపడానికి సహకరించాలన్నారు. ఉప ముఖ్యమంత్రిముఖ్యమంత్రి ప్రపంచభట్టి విక్రమార్క సమర్థవంతమైన, డైనమిక్ నాయకత్వంలో సింగరేణి సంస్థ కొత్త గనుల ప్రారంభం, వ్యాపార విస్తరణ మరియు నూతన ప్రాజెక్టులతో శరవేగంగా ముందుకు సాగుతోందని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కొనియాడారు. భవిష్యత్తులో సింగరేణిని దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. సింగరేణి గొప్పతనాన్ని ఎన్నో వేదికలపై ప్రశంసించానని ఆయన గుర్తుచేసుకున్నారు. సింగరేణి మనమందరం గర్వపడాల్సిన ప్రతిష్టాత్మకమైన సంస్థ అని అభివర్ణించారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీ వాసిరెడ్డి, ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ శ్రీ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీ లక్ష్మీపతి గౌడ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కోసం అతికీలకమైన నైనీ బొగ్గు బ్లాక్ సాధన కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క స్వయంగా ఒడిశా వెళ్లి అక్కడ ముఖ్యమంత్రిని, స్థానిక ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలిసి వారందరినీ ఒప్పించి అన్ని అనుమతులు సాధించారని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా గత ఏడాది నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైందని, రాష్ట్ర ఇంధన అవసరాల కోసం ఈ నెలలో తొలి బొగ్గు రేకును సింగరేణికి కూడా రవాణా చేయడం సాధ్యమైందన్నారు. అదే సమయంలో 2013లో యూపీఏ ప్రభుత్వ కేటాయించిన తాడిచెర్ల –2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించడంలోనూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కృషి చేశారని ప్రశంసించారు. అదే సమయంలో బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా గత బీఆర్ఎస్ పాలకులు సింగరేణిని అడ్డుకోవడం వల్ల కంపెనీ మనుగడకు కీలకమైన రెండు కీలక గనులను సంస్థ చేజార్చుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో సింగరేణిలో బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనడానికి సింగరేణికి అనుమతి ఇవ్వడం వల్ల ఇటీవలే మణుగూరు డిప్‌సైడ్ –2 బ్లాక్‌ను సింగరేణి చేజిక్కించు కుందని వారు వివరించారు. బొగ్గు ఉత్పత్తికి పరిమితమైన సింగరేణి సంస్థను కీలక ఖనిజ రంగం వైపు తీసుకెళ్తు అంతర్జాతీయ సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజ అన్వేషణ లైసెన్స్ కూడా సింగరేణి దక్కించుకోవడంలో ప్రజా ప్రభుత్వంలో సింగరేణి సాధించిన మరో విజయమన్నారు. అదే సమయంలో కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ పంపిణీ చరిత్రాత్మకమన్నారు. ఉద్యోగాల్లో గరిష్ట వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం మంది లబ్ధిపొందారన్నారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్ర మంలో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ శ్రీ రాజ్ కుమార్, ప్రాతినిధ్య సెక్రటరీ జనరల్ శ్రీ జనక్ ప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ నర్సింహారెడ్డి, అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ లక్ష్మీపతి గౌడ్, శ్రీ పెద్ది నర్సిం హులు, అన్ని ఏరియాలకు సంబం ధించిన గుర్తింపు ప్రాతి నిధ్య, అధికార సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# 22ఏపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

- నకిలీ జీఓలు.. బోగస్ మెమోలు.. ఫేక్ సర్టిఫికెట్లతో భూదందాలు
- అక్రమార్కులపై క్రిమినల్ కేసులు
- ప్రభుత్వ భూమిని ప్రైవేట్‌గా చూపిస్తే సహించం
- యుఎల్‌సీపై త్వరలో విధాన నిర్ణయం
- ప్రధాన ప్రతిపక్షం కోరితే CS-7, CS-14 భూ వ్యవహారంపై సెట్ దర్యాప్తు
- రిజిస్ట్రేషన్ స్లాట్ రద్దుచేసుకున్న వారి సొమ్మును వారం రోజుల్లో చెల్లింపు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 24:-**

రాష్ట్రంలో 22ఏలో లక్షలాది ఎకరాలు చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, 2023 డిసెంబర్ 7 నాటికి ఉన్న పరిస్థితి, ప్రస్తుత పరిస్థితి, ఏ కేటగిరీ భూములు ఎంత మేర నిషేధిత జాబితాలో ఉన్నాయో పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచుతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 22ఎ పేరిట ప్రతిపక్షాలు అనవసర రాద్దాంతాన్ని సృష్టిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. 22ఎ పేరిట ఇంతవరకు వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని దీనిపై దుష్ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటికి నిషేధిత జాబితాలో ఉన్న ఫారెస్ట్, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ప్రైవేట్ భూములు తదితర వివరాలను కేటగిరీల వారీగా మొత్తం వివరాలను మీడియాకు విడుదల చేశారు. సోమవారం నాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రిగారు మాట్లాడుతూ.. లక్షలాది ఎకరాలు 22ఎలో పెట్టారని ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం కాదు.. ఎంత ఉంది, ఎందుకు ఉంది, ఎవరి భూమి, ఏ కారణంతో నిషేధిత జాబితాలో పెట్టారనే ప్రతి అంశాన్ని రికార్డులతో చెబుతాం. వాస్తవాలు ప్రజల ముందుకు వస్తే ఎవరు నిజం చెబుతున్నారో ప్రజలే నిర్ణయిస్తారు అన్నారు. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులు లేదా రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు మళ్లించకుండా కాపాడటం 22ఏ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని రెండు రెవెన్యూ గ్రామాల్లో 122 ఎకరాలు, మరోచోట 400కు పైగా ఎకరాలు కలిపి సుమారు 522 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన వ్యవహారాలను మంత్రి ఉదాహరణగా ప్రస్తావించారు. ఎన్నికలకు ముందు ఈ భూముల వ్యవహారం అప్పట్లో మీడియాలో కూడా చర్చకు వచ్చిందని, ప్రభుత్వ భూములను భారీ విస్తీర్ణాల్లో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించారు. ఇలాంటి భూములను నిషేధిత జాబితాలో పెట్టడం తప్పా ? ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు.సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి రెవెన్యూ గ్రామంలో 1958కు ముందు అసైన్‌మెంట్ జరిగినట్లు చూపిస్తూ, సరైన ప్రభుత్వ రికార్డులు లేకుండానే భూములపై హక్కులు సృష్టించి దారదత్తం చేశారు. హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లో సర్వే నంబర్ 403కు సంబంధించి సుమారు 1,280 ఎకరాల విస్తీర్ణం ఉండగా, అందులో కేవలం రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని మంత్రి తెలిపారు.గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు రికార్డులు అప్‌లోడ్ చేసే సమయంలో మొత్తం సర్వే నంబర్‌ను పేర్కొనడం వల్ల ముఖ్యమంత్రి గారి నివాసంతో పాటు తన నివాసం కూడా పీఓబీలో చేర్చారని దానిని గుర్తించి వెంటనే సరిచేశామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో సర్వే నంబర్ 172 ప్రభుత్వ భూమి, 173 ప్రైవేట్ భూమి అని, 173 పేరుతో అనుమతులు తీసుకుని 172 ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టిన ఉదాహరణను మంత్రి వివరించారు.“ప్రైవేట్ సర్వే నంబర్ పేరుతో అనుమతులు తీసుకుని ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేస్తే.. ఆ ప్రభుత్వ భూమిని 22ఏలో పెట్టకూడదా? 173లో కాదు, 172 ప్రభుత్వ భూమిలో పెట్టాం. ప్రభుత్వ భూమిని కాపాడటం మా బాధ్యత.” అని వివరించారు. మేడ్చల్ జిల్లా పర్వతాపూర్ ప్రాంతంలో ప్రధాన రెవెన్యూ గ్రామం, దానికి అనుబంధ హ్యామ్లెట్‌కు ఒకే తరహా సర్వే నంబర్లు కేటాయించడం వల్ల భూ వివాదాలు తలెత్తాయని మంత్రి చెప్పారు.సర్వే నంబర్లను సక్రమంగా పునర్వ్యవస్థీకరించి, సమగ్ర సర్వే ద్వారా ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.మహేశ్వరం మండలంలోని 22 ఎకరాల సర్వే నంబర్‌లో రెండు ఎకరాలను భూదాన్ భూమి ఉంటే మొత్తం 22 ఎకరాలకు పాస్‌బుక్ జారీ కావడం, భూదానం చేసిన రెండు ఎకరాలను ప్రత్యేకంగా గుర్తించడంలో సమస్య ఏర్పడడంతో మొత్తం 22 ఎకరాలను పీఓబీలో పెట్టడం జరిగిందన్నారు. భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూముల విషయంలో రికార్డులను కేసుల వారీగా పరిశీలించి, వాస్తవ హక్కుదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నకిలీ జీఓలు, మెమోలు, అధికారుల సంతకాలతో బోగస్ పత్రాలు సృష్టిస్తున్న వ్యవహారాలను గుర్తించామని ఆమేరకు క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశాలిస్తున్నామన్నారు. మేడ్చల్ జిల్లాలో 22-04-2026 తేదీతో జిల్లా కలెక్టర్ సంతకం చేసినట్లు చూపిస్తూ ఒక నకిలీ మెమోను, మరోచోట 02-06-2026 తేదీతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పేరుతో బోగస్ సర్టిఫికెట్‌ను సృష్టించి రిజిస్ట్రేషన్ కోరిన వ్యవహారాలను గుర్తించామని చెప్పారు.సంబంధిత వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం ( అర్బన్ ల్యాండ్ సీలింగ్ - యుఎల్‌సి) కి సంబంధించి కొద్దిరోజుల్లో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని మంత్రిగారు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో CS-7, CS-14కు సంబంధించి 2017లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి సంబంధించిన పత్రిక ఎండి ఒక భూస్వామి నుంచి ఎస్ క్లాస్ బెంజి కారు తీసుకొని 5 డాక్యుమెంట్ల ద్వారా 811 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న అంశంపై ప్రధాన ప్రతిపక్షం కోరితే సెట్ దర్యాప్తునకు ఆదేశిస్తామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్, మేడ్చల్–మల్కాజిగిరి ప్రాంతాల్లో యుఎల్‌సి క్లియరెన్స్‌కు సంబంధించిన సమస్యలను మంత్రి వివరించారు.యుఎల్‌సి క్లియర్ చేసుకున్న భూములకు సంబంధించిన జీఓలు, ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని, యుఎల్‌సికి దరఖాస్తు చేయని లేదా క్లియరెన్స్ పొందని భూములు నిషేధిత జాబితాలో ఉండటం సహజమేనని చెప్పారు.యుఎల్‌సి క్లియర్ చేసుకున్న వారికి ఇబ్బంది లేదు. అవసరమైన పత్రాలు అందిస్తే ప్రభుత్వం పరిశీలించి క్లియర్ చేస్తుంది. కానీ యుఎల్‌సి కూడా చేయించుకోకుండా ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూములుగా చూపిస్తూ ప్రచారం చేయడం సరికాదని చెప్పారు. 22ఏ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చాయని మంత్రి తెలిపారు.రిపీటెడ్, ఓవర్‌ల్యాప్ కాల్స్ తొలగించిన తర్వాత 980 ప్రత్యేక ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వీటిలో 547 వ్యవసాయ భూములు, 433 వ్యవసాయేతర భూములకు సంబంధించినవని తెలిపారు.రంగారెడ్డి నుంచి 258, మేడ్చల్ నుంచి 149, సంగారెడ్డి నుంచి 82,



కామారెడ్డి నుంచి 44, యాదాద్రి భువనగిరి నుంచి 40, సిద్దిపేట నుంచి 35 కాల్స్ వచ్చినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 22ఎపై కొన్ని పత్రికల్లో వస్తున్నట్లుగా తీవ్ర సమస్య లేదని అన్నారు. ఇప్పటికే రిలాక్సేషన్ పొందిన 22ఏ కేసుల్లో సుమారు 98 శాతం స్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు.సుమారు 300కు పైగా స్లాట్లలో దేవాదాయ, భూదాన్ తదితర కారణాలతో రిజిస్ట్రేషన్‌కు వీలు లేని 12–13 కేసులను మాత్రమే తిరస్కరించినట్లు చెప్పారు.రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయిన వారికి ఈ వారాంతంలోపు ఆ మొత్తాన్ని తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 22ఏకు సంబంధించిన నిజమైన సమస్యలను 24 గంటల్లో, అవసరమైన సందర్భాల్లో గరిష్ఠంగా 36 గంటల్లో పరిష్కరించేలా ఫాస్ట్‌ట్రాక్ విధానం అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.ప్రజలను భయపెట్టడం మా ప్రభుత్వ విధానం కాదు.. ప్రజలకు భరోసా కల్పించడం మా బాధ్యత. ప్రభుత్వ భూములను కాపాడటం ఎంత ముఖ్యమో, న్యాయబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం” అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తాం.. ప్రతి రికార్డును ధృవీకరిస్తాం.. తప్పు జరిగితే సరిదిద్దుతాం.. అక్రమం జరిగితే చర్యలు తీసుకుంటాం. కానీ తప్పుడు ప్రచారంతో ప్రజలను భయాందోళనలకు గురి చేయడానికి మాత్రం ఈ ప్రభుత్వం అనుమతించదు అని అన్నారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్స్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.






Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com